ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
3
బుధవారం 6 నవంబరు 2024



కారు-చౌకగా కొట్టేసి..

అడ్డగోలు అనుమతులు

- రైతులను భయపెట్టి, దాడులు చేసి భూముల కొనుగోలు
- రెవెన్యూలోకి మార్చి 400 ఎకరాల అటవీ భూముల ఆక్రమణ
- సీఎంగా చంద్రబాబు, ఎన్డీఏ రాకుంటే రాష్ట్రం పరిస్థితి వేరుగా ఉండేది
- సరస్వతి భూముల పరిశీలనలో జగన్‌పై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ధ్వజం

మాచవరం, పిడుగురాళ్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): 'ముఖ్యమంత్రి పదవిని.. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఆనాడు వైఎస్ఆర్, మొన్నటి జగన్ సరస్వతి పవర్ పేరుతో ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారు. రైతులకు చెందిన భూములను కారుచౌకగా కొట్టేశారు. అడ్డగోలుగా అనుమతులు పొందారు..' అని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తెలిపారు. పల్నాడు జిల్లా మాచవరం మండలం వేమవరం, చెన్నాయపాలెం మధ్యలో సరస్వతి పవర్ ఇండస్ట్రీ పేరుతో (మిగతా 4వ పేజీలో)

అధికారంతో రాసేసుకున్నారు

సహజవనరులు అందరి సొత్తు అయినా జగన్ ఇష్టానుసారంగా వాడుకున్నారు. సరస్వతి సిమెంట్స్ పేరుతో అనుమతులు ఇవ్వరేమోనని సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీ పేరుతో అనుమతులు పొందారు. సిమెంట్‌కు ఉపయోగించే క్లింకర్ తయారీకి మాత్రమే అనుమతి తీసుకున్నారు. పర్యావరణ, పొల్యూషన్ అనుమతుల కోసం జగన్ దరఖాస్తు కూడా చేయలేదు. అధికారం అండతో 196 కోట్ల లీటర్ల కృష్ణాజలాల కేటాయింపులు చేసుకున్నారు. సీఎంగా నాడు రాజశేఖర్‌రెడ్డి, ఆ తర్వాత జగన్ వాళ్లంతట వాళ్లే సరస్వతి పేరుతో భూముల నుంచి అనుమతుల వరకు రాసుకున్నారు. వైఎస్ హయాంలో 31 సంవత్సరాల లీజుకు తీసుకున్నారు. 2014-19 మధ్యలో జగన్ 50 ఏళ్లు పాటు ఉండేలా లీజును పొడిగించుకున్నారు. రైతులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చేందుకే ఇక్కడకు వచ్చినట్లు తెలిపారు.



సరస్వతి భూముల వద్ద మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



ఓపెన్ టాప్ వాహనంపై నుంచి మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

భూములపై విచారణకు ఆదేశాలు

రైతుల ఇష్టంతో పనిలేకుండా దాడులు చేసి భూములు కొనుగోలు చేశారు. ప్రభుత్వ భూములు, చుక్కల భూములు, కుంటలు, కాల్వలు సైతం జగన్ కలిపేసుకున్నారు. రైతుల వద్ద కొనుగోలు చేసిన భూములు కాకుండా వందల ఎకరాలు భూములు ఆక్రమించారు. అటవీ భూములున్నా రెవెన్యూ అనుమతి లేకుండానే పేరు మార్చేసుకున్నారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరపాలని కలెక్టర్ అరుణ్‌కుమార్‌ను పవన్‌కల్యాణ్ ఆదేశించారు. రైతులపై దాడులు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీని ఆదేశించారు. ఉపాధి పేరుతో రైతులకు ఆశ కల్పించి ఇప్పటి వరకు ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టకపోవడంపై కూడా సమగ్ర విచారణ జరిపిస్తామన్నారు.



సరస్వతి భూముల వివరాలను పవన్‌కల్యాణ్‌కు వివరిస్తున్న కలెక్టర్ అరుణ్‌కుమార్, పక్కన ఎమ్మెల్యే యరపతినేని

రేపు తాళ్లాయపాలేనికి..

సీఎం చంద్రబాబు

- 400 కేవీ సబ్‌స్టేషన్ ప్రారంభించనున్న సీఎం
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

తుళ్ళూరు/గుంటూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు మండలం తాళ్లాయపాలేనికి గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రానున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన 400/220 కేవీ సబ్‌స్టేషన్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. ఈ క్రమంలో ఆయా ఏర్పాట్లను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరి, సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్‌తేజ మంగళవారం పరిశీలించారు. అనంతరం కలెక్టర్ విలేకర్లతో మాట్లాడుతూ సీఆర్డీఏ పరిధిలో కార్యాలయాల డిమాండు, భవిష్యత్ అవసరాలకు తగినట్లు ఉండేలా తాళ్లాయపాలెంలో 400/220 కేవీ సబ్‌స్టేషన్‌ను జీఐఎస్ పద్ధతిలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవం అనంతరం ఇతర జిల్లాలకు సంబంధించిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి ప్రారంభోత్సవాలు చేస్తారని తెలిపారు. బుధవారం సాయంత్రంలోపు పనులన్నీ పూర్తి చేసి ట్రయిల్ రన్ కూడా నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ పోవర్ స్వప్నిల్ జగన్నాథ్, ఎంటీఎంసీ కమిషనర్ అలీంబాషా, ఆర్డీవో కే.శ్రీనివాసరావు, ఎంపీడీవో శిల్ప, తహసీల్దార్ సుజాత తదితరులు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబు ప్రారంభించనున్న తాళ్లాయపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరి

డిగ్రీ ప్రొవిజినల్ సరిపోదంట

- సీఈవో ఆదేశాలకు విరుద్ధంగా బీఎల్వోలు
- పట్టభద్రులుగా ఓటు హక్కు అర్హతపై వక్రభాష్యం
- పది, ఇంటర్ సర్టిఫికెట్లు తప్పనిసరి అంటున్న వైనం
- అధికారుల తీరుతో దరఖాస్తుకు వెనకడుగు వేస్తున్న ఓటర్లు

గుంటూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఓటుహక్కు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చట్టాలతో ఏర్పాటైన యూనివర్శిటీలు జారీ చేసిన డిగ్రీ సర్టిఫికెట్ ఏదైనా ఉంటే చాలని ఒకపక్క రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి వివేక్‌యాదవ్ స్పష్టం చేస్తున్నారు. అయితే ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని కొందరు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు పట్టించుకోవడంలేదని సమాచారం. ఓటుహక్కు దరఖాస్తుని ప్రాసెస్ చేయాలంటే తమకు తప్పనిసరిగా 10, ఇంటర్, డిగ్రీ ఒరిజినల్ సర్టిఫికెట్లు చూపించడంతో పాటు వాటి కాపీలపై గజిటెడ్ అధికారి సంతకం చేసి ఉండాలని స్పష్టం చేస్తున్నారు. అలానే ఫారం-18 హార్డ్ కాపీ కూడా ఇవ్వాలంటున్నారు. ఇవన్నీ ఇస్తేనే దరఖాస్తుని ప్రాసెస్ చేసి ఏఈఆర్‌వో/ఈఆర్‌వోలకు పంపుతామని, లేకుంటే తీసుకునేది లేదని చెబుతున్నారు. దీంతో గతంలో మూడు సార్లు పట్టభద్రుల నియోజకవర్గంలో ఓటు హక్కు వినియోగించుకున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవడానికి వెనకడుగు వేస్తున్నారు. ఎన్నికల సంఘం పట్టభద్రుల ఓటుహక్కు అర్హత విషయంలో స్పష్టమైన ఆదేశాలను జారీ చేసింది. అయితే గుంటూరు నగరంతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న బీఎల్‌వోలను ఈఆర్‌వోలు తప్పుదోవ పట్టించారు. 10, ఇంటర్, డిగ్రీ ఒరిజినల్ డిగ్రీ సర్టిఫికెట్లు తప్పనిసరిగా ఉండాలని, లేకుంటే దరఖాస్తుని తిరస్కరించాలని ఆదేశించారు. ఆ మేరకు బీఎల్‌వోలు ఎలా పడితే అలా దరఖాస్తులను తిరస్కరిస్తున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలను నగరపాలకసంస్థ అదనపు కమిషనర్ ఓబులేసు దృష్టికి 'ఆంధ్రజ్యోతి' తీసుకెళ్లగా తమకు తెలియదని సమాధానం చెప్పారు. అలాంటి ఆదేశాలు ఏమైనా ఉంటే తమకు ఇస్తే పరిశీలిస్తామన్నారు. గుంటూరులో బీఎల్‌వోలు, ఈఆర్‌వోలు వ్యవహరిస్తున్న తీరుపై రాజకీయ పార్టీల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత రెండు, మూడు సార్ల నుంచి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసిన వారు ఇప్పుడు అనర్హులని చెబుతుండటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. దీనిపై తాము ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామన్నారు.



స్పందన అంతంతే..

కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం శాసనమండలి ఎన్నిక కోసం ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు నమోదు ప్రక్రియకి ఆశించినంతగా స్పందన కనిపించడం లేదు. ఈ సారి ఓటర్ల సంఖ్య దాదాపుగా 3.50 లక్షల నుంచి నాలుగు లక్షల వరకు చేరుకోవచ్చని ఎన్నికల అధికారులు అంచనా వేశారు. 2019లో ఎన్నికలు జరిగినప్పుడు 2,48,799 మంది ఓటర్లుగా నమోదయ్యారు. అయితే ఈ దఫా ఇప్పటివరకు 2.25 లక్షల దరఖాస్తులు దాఖలయ్యాయి. బాపట్ల జిల్లాలో 16482, ఏలూరులో 9982, గుంటూరులో 74753, కృష్ణాలో 37712, ఎన్‌టీఆర్‌లో 46319, పల్నాడులో 40105 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో లక్ష్యానికి చాలాదూరంలో ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాలు నిలిచాయి. మహా అయితే మరో 25 వేల దరఖాస్తుల కంటే ఎక్కువ వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

నేటితో గడువు ముగింపు

ఓటరు నమోదు కోసం సెప్టెంబరు 30వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకారాన్ని ఎన్నికల సంఘం ప్రారంభించింది. ఈ నెల 6వ తేదీ బుధవారం సాయంత్రం వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ప్రకటించింది. అయితే ఓటర్ల సంఖ్య గతంలో కంటే పెరగకపోగా తగ్గే పరిస్థితులు కొంతమంది అధికారుల ప్రవర్తన కారణంగా తలెత్తాయి. ఓటరుగా నమోదయ్యేందుకు ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. దాంతో చాలామంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అలానే ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్న అభ్యర్థులు శిబిరాలను ఏర్పాటు చేసి పట్టభద్రులతో దరఖాస్తు చేయిస్తున్నారు.

టోల్ బాదుడు

- ఒకేసారి 25.9 శాతం చార్జీల పుంపు
- కమర్షియల్ వాహనాలకు ఆర్థిక భారం
- ఎన్‌హెచ్‌ఏఐ నిర్ణయం ఆర్టీసీపై ప్రభావం

గుంటూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) టోల్‌గేట్ చార్జీల ను భారీగా పెంచింది. వివిధ రకాల వాహనాలపై ఒకేసారి 25.9 శాతం పెరిగింది. అంతేకాకుండా తిరుగు ప్రయాణం విషయంలో నిబంధనని సవరించింది. గతంలో ఒకసారి రిటర్న్ జర్నీ తీసుకుంటే 24 గంటల వ్యవధిలో ఎన్నిసార్లు అయినా టోల్‌గేట్‌ని క్రాస్ చేయవచ్చు. అలాంటిది ఇప్పుడు ఒక్కసారికి మాత్రమే దానిని కుదించింది. పెరిగిన టోల్‌చార్జీలు ఏపీఎస్‌ఆర్‌టీసీ పైనా ప్రభావాన్ని చూపనున్నాయి. గుంటూరు - విజయవాడ మధ్య కాజా, చిలకలూరిపేట - ఒంగోలు మార్గంలోని బొల్లాపల్లి, పిడుగురాళ్ల - పొందుగల మధ్య బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న టోల్‌గేట్ల చార్జీలు భారీగా పెరిగాయి. కొత్తగా అమల్లోకి తీసుకొచ్చిన (మిగతా 4వ పేజీలో)



కాజా టోల్‌ప్లాజా

డీఎస్సీకి ఉచిత శిక్షణ
బీసీ స్టడీ సర్కిల్‌లో
200 మంది అభ్యర్థులకు అవకాశం
4

వైసీపీ నేత
అక్రమ రిజిస్ట్రేషన్‌పై విచారణ
చిరుమామిళ్ళలో విచారించిన ఆర్డీవో మధులత
4

చంద్రబాబు, పవన్‌లపై అనుచిత పోస్టింగ్స్
వైసీపీ సోషల్ మీడియా సభ్యులపై 15 కేసులు
ఐదుగురు నిందితుల గుర్తింపు

అల వైకుంఠపురంలో... అన్నీ సమస్యలే



యాగశాల కాస్త కేశఖండనశాలగా మార్పు
గోశాల కాస్త పొంగలి షెడ్డుగా మార్పు
శంకుస్థాపనతోనే నిలిచిపోయిన కేశఖండనశాల
దుస్తులు మార్చుగదులులేక ఆరుబయటే భక్తులు
ఇబ్బందులు పడుతున్న భక్తులు
6

నర్సింగ్ విద్యార్థిని మృతి కేసులో
వీడిన మిస్టరీ
లైంగిక సంబంధానికి ఒప్పుకోక పోవడంతో భవనంపై నుంచి తోసేసి చంపిన మహిళ

ఏసీబీ వలలో వీఆర్వో
మ్యుటేషన్ కోసం రూ.2.5లక్షల డిమాండ్
వెంగళాయపాలెం సచివాలయంలో పట్టుబడిన హసీనా
6



హసీనా

వైసీపీ నేత అక్రమ రిజిస్ట్రేషన్‌పై ఆర్డీవో విచారణ



చిరుమామిళ్ళలో విచారిస్తున్న ఆర్డీవో మధులత

నాదెండ్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిరుమామిళ్ళకి చెందిన వైసీపీ నేత, మార్కెట్ యార్డు మాజీ వైస్ ఛైర్మన్ సింగారెడ్డి కోటి రెడ్డితో పాటు కుటుంబ సభ్యులు చేసిన అక్రమ రిజి స్ట్రేషన్‌పై నరసంరావుపేట ఆర్డీవో మధులత మంగళవారం విచారణ జరిపారు. గ్రామంలోని సర్వే నెంబరు 174 చెరువు పోరం బోకు భూమిని 173-ఏ సర్వే నంబరుగా దొంగ సర్టిఫికెట్ పుట్టించిన కోటిరెడ్డి తన చిన్న కోడలు యశోద పేరుతో 2002లో రిజిస్ట్రేషన్ చేయించాడు. ఆమె నుంచి సాయిబాబా ట్రస్ట్ ఛైర్మన్‌గా ఉన్న మేకల రామిరెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యుల పేరుతో రిజిస్ట్రేషన్ చేయించి సొమ్ము చేసుకున్నాడని కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. ఈ క్రమంలో గడిచిన ఆదివారం చెరువు స్థలంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌తో సహా ఆ ప్రాంతాన్ని సర్వే చేసిన అధికారులు చెరువు పోరంబోకుగా నిర్ధారించారు. దీనిలో భాగంగా ఆర్డీవో మాధవిలత ఆ గ్రామాన్ని సందర్శించి విచారణ జరిపారు. 2013 సంవత్సరంలో వీఆర్‌వోగా పని చేసిన చిన బ్రహ్మంను పిలి పించి విచారించారు. 2022 సంవత్సరంలో సర్టిఫికెట్ ఇచ్చారా? అని ఆమె ప్రశ్నించగా, ఆ సర్టిఫికెట్‌తో తనకు సంబంధం లేదని చిన బ్రహ్మం తెలిపారు. గతంలో చిన బ్రహ్మంకు సంబంధించిన రికార్డు పరిశీలించాలని, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించిన రామిరెడ్డి వద్ద ఉన్న ధారాలు తీసుకొని నివేదిక పంపాలని తహ సీల్దార్ ఏవీ రమణకు సూచించారు.

'విశిష్ట సాహితీమూర్తి జీవితకాల సాధన' పురస్కారానికి పెనుగొండ ఎంపిక



గుంటూరు(తూర్పు), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అప్పా జ్యోసుల విష్ణు భొట్ల కందాళం ఫౌండేషన్ వారు ప్రతిష్ఠాత్మకంగా అందజేసే విశిష్ట సాహితి మూర్తి జీవిత కాల సాధన పురస్కారానికి ప్రముఖ సాహితివేత్త పెనుగొండ లక్ష్మీనారాయణ ఎంపికయ్యారు. 2025 జనవరి 3, 4, 5 తేదీలలో విజయవాడలో మాకినేని బసవ పున్నయ్య విజ్ఞానకేంద్రంలో జరిగే సభలో ఈ పురస్కారాన్ని ఆయనకు అందజేస్తారు. 1972లో 'సమిధ' అనే కవితా ప్రచురణతో తన సాహిత్య ప్రస్థానం చేపట్టిన లక్ష్మీనారా యణ, రేపటిలోకి కవితాసంపుటి, అనేక, విదిత, దీపిక వ్యాస సంపుటాలు, కామ్రేడ్ పులుపుల వెంకట శివయ్య జీవితచరిత్ర, గుంటూరు సీమ సాహిత్యచరిత్ర రచయిత, గుంటూరు కథలు, విశాలాంధ్ర తెలుగుకథ, అరాజకీయం, కథా స్రవంతి సంపుటాలు, తిలక్ సాహితీ సందర్శనం, బల్గేరియా కవిత, కవితా ఓ కవితా సంకలనాలు, కవితా స్రవంతి సంకలనాలు, కథా స్రవంతి సంకలనాలు ముదలైన 90కి పైగా సాహిత్య పుస్తకాలకు సంకలనకర్తగా, సంపా దకునిగా, సహసంపాదకునిగా ఆయన అనేక సేవలందించారు. ఈ సందర్భంగా పురస్కారానికి ఎంపికైన పెనుగొండ లక్ష్మీ నారాయణను పలువురు అభినందించారు.

ప్రతి నీటి బిందువు కాంతి సింధువైంది

- టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టును పరిశీలించిన చీఫ్ ఇంజనీర్ కాంతారావు
- వరుసగా మూడో ఏడాది రికార్డు స్థాయిలో విద్యుదుత్పత్తి



ఎంసీఆర్‌ను పరిశీలిస్తున్న చీఫ్ ఇంజనీర్ కాంతారావు, ఇతర ఇంజనీర్లు

రెంటచింతల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రతి నీటి బిందువు కాంతి సింధువుగా మారిందని, రికార్డుస్థాయిలో విద్యుదుత్పత్తి చేయడం హర్షణీయమని శ్రీశైలం ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ డీవీఎస్ఎస్ఎల్ కాంతారావు అన్నారు. సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మించిన నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టును మంగళవారం ఆయన సందర్శించారు. కాంతారావు మాట్లాడుతూ ప్రతి ఏటా మార్చి 31 వరకు నిర్దేశించిన 78 ఎంయుల విద్యుత్ తయారవుతుందని, వరుణుడు సకాలంలో కరుణించడం, ఉద్యోగుల కృషి వలన నవంబరు 4వ తేదీ రాత్రికే ఈ లక్ష్యాన్ని అధిగమించామంటూ హర్షం వ్యక్తం చేశారు. మరో 5 నెలలో ఇంకా విద్యుత్ ఉత్పత్తి జరిగే అవకాశం ఉందని, ఆ దిశగా అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని బేరీజు వేసుకుంటూ ముందుకెళ్లాలని సూచించారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి కేవలం 0.7284 ఎంయుల విద్యుత్ మాత్రమే తయారైందని అందుకు అధికారులు బాధ్యులు కాదని ,ఎగువన ఉన్న సాగర్ నుంచి నీరు వస్తుంటేనే విద్యుత్ ఉత్పత్తి సాధ్యమౌతుందని స్పష్టం చేశారు. ఎంసీఆర్(మెయిన్ కంట్రోల్ యూనిట్) పలు విభాగాలను పరిశీలించిన ఆయన, ప్రాజెక్టు స్వరూప స్వభావాలను తెలుసుకున్నారు. రూ.1050 కోట్లతో నిర్మితమైన ఈ ప్రాజెక్టులో 2017 జనవరి 9న మొదటిసారి విద్యుదుత్పత్తి జరిగినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ పేర్కొన్నారు. ప్రాజెక్టు ప్రారంభం నుంచి ఇప్పటి వరకు 551.47 ఎంయుల విద్యుత్ తయారైందని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్వీట్లు పంచుకుని పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఈ కె.వెంటకరమణ, ఈఈ సుబ్రహ్మణ్యం, ఏడీఈలు నాగరాజు,రత్తయ్య,మెహబూబ్,గిరిబాబు,జయశంకర్,సుబ్బారావు పాల్గొన్నారు.

కుడి జలవిద్యుత్ కేంద్రంలో పరిశీలన

మాచర్ల రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురిసౌత్ నాగార్జున సాగర్ కుడి జల విద్యుత్ కేంద్రాన్ని ఏపీ జెన్‌కో శ్రీశైలం కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ కాంతారావు మంగళవారం పరిశీలించారు. జల విద్యుత్ కేంద్రంలో మరమ్మతులకు గురైన మూడో యూనిట్‌ను పరిశీలించి త్వరితగతిన యూనిట్ పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కుడికాలువ క్రస్ట్ గేట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం శ్రీసీతారాముల ఆలయాన్ని సందర్శించారు. సీఈ వెంట ఎస్ఈ రమణ, ఓఅండ్ఎం ఆర్‌సీపీహెచ్ డీఈ అప్పాజి, డీఈ రాజారెడ్డి, ఏడీఈ మోహన్‌బాబు, ఏఈఈ గౌతమ్‌కుమార్, అమర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలతో చెలగాటం ఆడితే సహించేది లేదు ఎమ్మెల్యే ప్రత్తిపాటి

వంకాయలపాడు(యడ్లపాడు), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడితే సహించేది లేదని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హెచ్చరించారు. యడ్లపాడు మండలంలోని కారుచోల-వంకాయలపాడు గ్రామాల మధ్య గల సబ్బుల తయారీలో వినియోగించే ముడికేక్, నూనెల తయారీ పరిశ్రమ వలన ఇరుగ్రామాల ప్రజలు వ్యాధులకు గురవుతున్నారంటూ ఇటీవల మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే అధికారులతో కలసి మంగళవారం పరిశ్రమను పరిశీలించారు. పరిశ్రమలో తయారవుతున్న పదర్దాలు వాటి తయారీకి వినియోగిస్తున్న ముడి పదార్దాలు, వెలువడుతున్న వ్యర్దాలు, వాటి నిర్వహణ గురించి ఆరా తీశారు. సత్వరమే ఫ్యాక్టరీని ఇక్కడి నుంచి వేరే చోటుకి తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పరిశ్రమతో సంబంధం ఉన్న అన్ని శాఖల అధికారులతో తనిఖీలు చేయించి ఎటువంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయో సమగ్ర విచారణ జరిపించి తగు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.

బలమైన పునాదులు వేసిన జవహర్‌లాల్ నెహ్రూ

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): భారీ పరిశ్రమలు, భారీ నీటిపారుదల ప్రాజెక్టులు నిర్మించి శాస్త్రీయ దృక్పథంతో, లౌకిక భావాలతో భారత దేశ అభివృద్ధికి బలమైన పునాదులు వేసిన స్ఫూర్తి ప్రదాత జవహర్ లాల్ నెహ్రూ అని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ మీడియా కమిటీ రాష్ట్ర ఛైర్మన్ డాక్టర్ ఎన్. తులసీరెడ్డి పేర్కొన్నారు. గుంటూరులో జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో భారత నిర్మాణ సారధి నెహ్రూజీ అనే అంశంపై మంగళవారం జరిగిన చర్చా గోష్ఠికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. అనంతరం సీనియర్ పాత్రికేయులు ఆలపాటి సురేష్, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి, నేస్తం సహవ్యవ స్థాపకులు టి.ధనుంజయ రెడ్డి, మానవత కార్యదర్శి కె. సతీష్, తదితరులు ప్రసం గించారు.

పొలసలో పోషక పదార్థాలపై పరిశోధనలకు పేటెంట్

పెదకాకాని, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్ గా పనిచేస్తున్న పి. వి. కృష్ణ గోదావరిలో లభించే పొలస చేపలలో ఉండే పోషక పదార్థాల పై చేసిన పరిశోధనలకు గాను పేటెంట్ హక్కులను పొందారు. ఈ మేరకు చెన్నైలోని భారత ప్రభుత్వ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ పేటెంట్ కార్యాలయం నుంచి అధికారిక ఆమోద ముద్ర వేస్తూ ధ్రువపత్రం అందింది. ఈ సందర్భంగా మంగళవారం ఉపకులపతి ఆచార్య కె. గంగాధరరావు ప్రొఫెసర్ పివి కృష్ణకు సన్మానం చేశారు.

కారుచౌకగా కొట్టేసి.. అడ్డగోలు అనుమతులు

(3వ పేజీ తరువాయి)

జగన్ కుటుంబం కొనుగోలు చేసిన భూములను మంగళవారం పవన్‌కల్యాణ్, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ దళితులను, రైతులను భయపెట్టి సొంత కంపెనీ కోసం జగన్ కారుచౌకగా భూములు కొనుగోలు చేశారన్నారు. మాచవరం, దాచేపల్లి మండలాల్లో సరస్వతి పవర్ ఇండస్ట్రీ పేరుతో భూములు కొనుగోలు సమయంలో రైతులకు ఇచ్చిన మాటను అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న రాజశేఖర్‌రెడ్డి, ఆ తర్వాత జగన్‌రెడ్డి మరిచారన్నారు. దళితులను, రైతులను బెదిరించి దాడులు చేసి పెట్రో బాంబులు వేసి వేట కొడవళ్లతో వెంటాడి భూములను హస్తగతం చేసుకున్నారన్నారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన కోడెల శివప్రసాదరావుపై వైసీపీ నేతలు దుష్ప్రచారం చేసి ఫర్నిచర్ కొట్టేశాడని అక్రమంగా కేసులు పెట్టి వేధించి చనిపోయేలా చేశారన్నారు. మరి వందల ఎకరాల భూములను కారుచౌకగా కొట్టేసి, అడ్డగోలు అనుమతులు తెచ్చుకున్న జగన్‌పై ఎన్ని కేసులు పెట్టాలని ప్రశ్నించారు. సీఎంగా చంద్రబాబు, కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం రాకుంటే ఏపీ పరిస్థితి వేరుగా ఉండేదని తెలిపారు. సరస్వతి భూముల విషయంపై క్యాబినెట్‌లో చర్చిస్తామన్నారు. సరస్వతి భూములపై గతంలో జరిగిన అన్ని విషయాలను యరపతినేని ద్వారా తెలుసుకున్నానని, యరపతినేని రైతులకు అండగా ఉంటున్నారన్నారు.

రైతులపై దాడులు చేస్తే ఉపేక్షించొద్దు

సరస్వతి పవర్ ఇండస్ట్రీకి భూములిచ్చిన రైతులపై దాడులు చేస్తే ఉపేక్షించవద్దని పోలీసు అధికారులను పవన్‌కల్యాణ్ ఆదేశించారు. భూములిచ్చిన రైతుల్లో ఆత్మస్థైర్యం పెరిగేలా చూడాలని ఎస్పీ శ్రీనివాసరావును ఆదేశించారు. మాచవరం మండలం చెన్నాయపాలెంలో 272.96, పిన్నెల్లిలో 93.79, వేమవరంలో 710.63, తంగెడలో 107.365 ఎకరాలు ఉన్నాయని, వాటిలో పట్టా 1083.715, చుక్కలు 76.19, అసైన్డ్ భూములు 24.84 ఎకరాలన్నారు. అంతే కాకుండా 400 ఎకరాలు అటవీ భూములను రెవెన్యూ కిందకు మార్చేసి సరస్వతి పవర్ కోసం తీసుకున్నారన్నారు.

ఫ్యాక్టరీ నిర్మిస్తారా.. భూములిచ్చేస్తారా?

మూడేళ్లలో ఫ్యాక్టరీ నిర్మించి, యువతకు ఉద్యోగాలిస్తామని రైతులను మభ్య పెట్టి భూములు కొనుగోలు చేసి 15 ఏళ్లుగా ఆ ఊసే మరిచిన జగన్ ఇప్పటికైనా ఫ్యాక్టరీ నిర్మించడమా లేదంటే భూములు తిరిగి ఇచ్చేయడమో చేయాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సరస్వతి పవర్ పేరుతో తక్కువ ధరకు రైతుల నుంచి కొనుగోలు చేసిన భూములను బ్యాంకుల్లో తనఖా పెట్టి వేల కోట్ల రుణాలు తీసుకున్నారని ఆరోపించారు. ఫ్యాక్టరీ నిర్మించకుండా, ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా రైతులను రోజు వారి కూలీలుగా మార్చారన్నారు. ఫ్యాక్టరీ నిర్మించకపోవడంతో కొంతమంది రైతులు భూములు సాగు చేసుకునేందుకు యత్నించగా అప్పటి ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకటరామిరెడ్డిలు గూండాలతో వచ్చి దాడులు చేశారన్నారు. సాక్షి పత్రికను అడ్డం పెట్టుకుని ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు రాస్తూ ప్రజలను మభ్య పెడుతున్నారన్నారు. 500 ఎకరాల భూమిని సరస్వతి భూముల్లో జగన్ కలిపేసుకున్నాడన్నారు. వందలాది మంది రైతులు కొన్నేళ్లుగా ఉపాధి లేక అల్లాడిపోతున్నా జగన్‌కు ఏమాత్రం పట్టడం లేదన్నారు. అంతకముందు సరస్వతి భూములను ఓపెన్ టాప్ వాహనంపై నుంచి పవన్‌కల్యాణ్ పరిశీలించారు. అనంతరం కొందరు రైతులతో పవన్‌కల్యాణ్, యరపతినేని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్‌గోనేరి, ఆర్డీవో మురళీకృష్ణలతో పాటు వివిధ శాఖల అధికారులు, టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

సిబ్బంది సమన్వయంతో ప్రణాళికలు తయారు చేయాలి

గుంటూరు సిటీ, నవంబర్ 5 (ఆంధ్రజ్యోతి): సంఘటితమైన సహచర శాఖల సిబ్బంది సమన్వయంతో అందరూ కలిసి ప్రణాళికలు తయారు చేయాలనీ ఏపీఎస్ఐఆర్ డీపీఆర్ జే డీ ఆర్ కేశవరెడ్డి కోరారు. గుంటూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారీపై జిల్లా స్థాయి శిక్షణా తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. గుంటూరు జిల్లా పంచాయితీ వనరుల కేంద్రం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ శిక్షణా తరగతుల్లో పల్నాడు జిల్లా కు చెందిన 28 మంది ఎంపీడీలు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా పరిషత్ సీఈఓ వి జ్యోతి బసు మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయాలని అన్నారు. శిక్షణ పొందిన అధికారులు, సిబ్బంది ఈనెల 12 నుంచి 16 వరకు మండలాలలో ప్రజా ప్రతినిధులకు, లైన్ డిపార్టుమెంటు అధికారులకు, సిబ్బందికి అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తారని అన్నారు.

బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

గుంటూరు(విద్య),నవంబరు 5(ఆంధ్రజ్యోతి): బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో డీఎస్సీ అభ్యర్థులకు (ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్) ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కే మయూరి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన బీసీ,ఎస్టీ,ఎస్సీ అభ్యరులకు ఈ నెల 14 నుంచి రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు గుంటూరులోని రాజాగారితోటలో ఉన్న బీసీ స్టడీ సర్కిల్‌ను 0863- 2358071 నంబరులో సంప్రదించాలని సూచించారు.

అనుచిత పోస్టింగ్స్.. నిందితుల గుర్తింపు

గుంటూరు నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ లపై సోషల్ మీడియాలో అనుచిత పోస్టింగ్స్ వైరల్ చేస్తున్న వైసిపి సోషల్ మీడియాకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 15 కేసులు నమోదయ్యాయి. ఆయా కేసుల్లో పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా ఇప్పటికే ఏడుకొండలు గుర్తించారు. వీరిలో తాడికొండ మండలం కంతేరుకి చెందిన రౌడీ షీటర్ కల్లం హరికృష్ణ రెడ్డిని మంగళవారం తాడికొండ పోలీసులు పోలీస్ స్టేషన్ పిలిపించి నోటీసులు జారీ చేశారు. అదేవిధంగా వైసిపి సోషల్ మీడియా కన్వీనర్ వెంకటరామిరెడ్డికి తాడేపల్లి పోలీసులు నోటీసులు జారీ చేసి స్టేషన్‌కు పిలిపించారు. తెనాలి వన్‌టౌన్, దుగ్గిరాల పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల్లో వైసిపి సోషల్ మీడియాకు చెందిన జగదీశ్వర్ రెడ్డిని గుర్తించి దుగ్గిరాల పోలీసులు ఆయనకు నోటీసు జారీ చేశారు. ఎలనాడులోని గురజాల పరిధిలోని అంబాపురానికి చెందిన మహిళ సుధారాణిరెడ్డి గత వైసిపి ప్రభుత్వ హయాంలో చిలకలూరిపేటలో ఉండేది. అప్పటి మంత్రి విడుదల రజిని ఆమెకు మున్సిపాలిటీలో ఔట్సోర్సింగ్ ఉద్యోగం కల్పించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆమెను ఉద్యోగం నుంచి తొలగి చారు. హైదరాబాద్ జూబ్లీ హిల్స్ లో ఉన్న వైసిపి సోషల్ మీడియా కార్యా లయంతో ఆమెకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి, ప్రస్తుతం నల్గొండ జిల్లాలో ఉంటోంది. ఇప్పటికే ఆమెపై చిలకలూరి పేటలో సోషల్ మీడియా కేసు నమోదు కాగా మంగళవారం ఆమెను చిలకలూరి పేట పోలీసులు నోటీసు జారీ చేసి అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. రెడ్డిగారి అమ్మాయి అనే ఫేస్బుక్ ఐడి ద్వారా ఆయా పోస్టింగ్స్ వైరల్ చేస్తున్నట్లు పోలీసులు విచారణలో తేలింది. మాచర్ల కి చెందిన నెమలి దిన్నె వెంకట రంగారెడ్డిపై మంగళగిరి టౌన్ పోలీస్‌స్టేషన్లో కేసు నమోదైంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	133, 142,153
చికెన్ విత్ స్కిన్	254.00
చికెన్ స్కిన్ లెస్	264.00

50,088 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 50,088 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 48,647 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి వినుకొండ అంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 25,206 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8000	16500	334	8000	15000
నెంబరు. 5	8000	12000	నెంబరు. 5	12000	15500
273	10000	13000	273	10000	12000
341	85000	15000	341	9000	14000
4884	10000	14600	4884	12000	13200
సూపర్ 10	-	-	సూపర్ 10	-	-
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	17500	తేజ	8500	17500
బ్యాడిగి	8000	13000	బ్యాడిగి	9000	14500
దేవనూరు డీలక్స్	9000	14500	దేవనూరు డీలక్స్	10000	14500
తెల్లకాయలు	5000	10500	తెల్లకాయలు	5000	10000

టోల్ బాదుడు

(3వ పేజీ తరువాయి)

చార్జీలతో కారు/జీపు/వ్యాన్ సింగిల్ జర్నీకి రూ.145, రిటర్న్ జర్నీకి రూ.220, నెలవారీ పాసు రూ.4790కి పెంచింది. అదే ఎల్‌సీవీ వాహనానికి సింగిల్ జర్నీకి రూ.245, బస్సు/ ట్రక్‌కు రూ.515, మూడు యాక్సిల్ వాహనం వరకు రూ.565, 4 నుంచి 6 యాక్సెల్స్ ఉన్న వాహ నాలకు రూ.810, హెచ్‌సీఎం/ ఈఎం ఈకి రూ.810, 7, అంతకంటే ఎక్కువ యాక్సెల్ వాహనాలకు రూ.820కి పెంచింది. రిటర్న్ జర్నీ ఎల్‌సీవీకి రూ.370, బస్సు/ ట్రక్‌కు రూ.770, త్రీ యాక్సెల్ వరకు వాహనాలకు రూ.845, 4 నుంచి 6 యాక్సెల్ వరకు వాహనాలకు రూ.1215, హెచ్‌సీఎం/ ఈఎంఈకి రూ.1215, ఏడు, అంతకంటే ఎక్కువ యాక్సెల్ ఉన్న వాహనాలకు రూ. 1230కి పెంచేసింది. నెలవారీ చార్జీలను కూడా బాదేసింది. ఎల్‌సీవీకి రూ.8230, బస్సు/ట్రక్‌కు రూ.17085, త్రీ యాక్సెల్ వరకు రూ.18810, 4 నుంచి 6 యాక్సెల్ వాహనాలకు రూ.27035, హెచ్‌సీఎం/ ఈఎంఈకి రూ.27035, ఏడు, అంతకంటే ఎక్కువ యాక్సెల్ వాహనాలకు రూ. 27290కి పెంచింది.

బస్సు చార్జీలు పెంచక తప్పని పరిస్థితి

టోల్ ప్లాజా రేట్లు పెంచడంతో ఆర్‌టీసీ, ప్రైవేటు బస్సుల చార్జీలను తప్పక పెంచాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. గతంలో 24 గంటల్లో ఎన్ని రిటర్న్ జర్నీలైనా చేసే అవ కాశం ఉన్నందున ఆర్టీసీ, ప్రైవేటు బస్సుల ఆపరేటర్లు ఆ చార్జీలను ప్రయాణికుల వద్దనే వసూలు చేసేవారు. ఇప్పుడు ట్రిప్పుల లెక్కన టోల్‌చార్జీలు చెల్లించాల్సిన పరిస్థితి తలెత్తింది. ఉదాహరణకు తాడికొండ - మంగళగిరి మధ్య ప్రైవేటు ఆపరేటర్ గతంలో నెలవారీ పాస్ తీసుకుంటే రూ.6500 అయ్యేది. ఇప్పుడు అపరిమిత రిటర్న్ జర్నీలు ఎత్తే యడం వల్ల నెలకు దాదాపుగా రూ.45 వేలు చెల్లించాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. ఇదే పరిస్థితి ఆర్టీసీపై కూడా పడుతుంది. దీంతో వారు టిక్కెట్ల ధరలు పెంచి టోల్ భారాన్ని ప్రయాణికుల నుంచి వసూలు చేసే అవకాశం ఉంది.

నెలవారీ పాస్ చార్జీల్లోనూ పెరుగుదల

గతంలో టోల్ ప్లాజాకు 20 కిలో మీటర్ల పరిధిలో నివ సిస్తూ సొంత వాహ నాలు కలిగిన వారికి నెలవారీ పాస్‌లను జారీ చేసేవారు. రూ.150 కట్టించుకుని ఈ పాస్ ఇచ్చేవారు. నెలలో 50 సింగిల్ జర్నీలు చేసే అవకాశం ఉండేది. ఇప్పుడు దానిని రూ.340కి పెం చింది. 50 సింగిల్ జర్నీలు దాటితే అదనంగా చెల్లించాల్సి వచ్చేది.

నేటి నుంచి కూచ్ బెహార్ ట్రోఫీ

మంగళగిరిసిటీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కూచ్ బెహార్ ట్రోఫీలో భాగంగా ఆంధ్ర, హిమా చల్ ప్రదేశ్ జట్ల మధ్య మంగళగిరిలోని ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో బుధవారం నుంచి ఈ నెల 9 వరకు మ్యాచ్ జరుగు తుందని ఏసీఏ కార్యదర్శి సానా సతీశ్‌బాబు వెల్లడించారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

7న ఎన్‌జీ రంగా జయంతి ఉత్సవాలు

గుంటూరు సిటీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు ఆచార్య ఎన్‌జీ రంగా జయంతి ఉత్సవాలు ఈ నెల 7వ తేదీన వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించనున్నట్లు అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ వీవీవీఎస్ దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ హాజరౌతారని తెలిపారు. రాష్ట్రంలోని ప్రముఖులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొంటారని తెలిపారు.

8న జిల్లా స్థాయి యువజనోత్సవాలు

గుంటూరు(విద్య), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): యువతీ, యువకుల్లో అంతర్లీనంగా ఉన్న నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా ఈ నెల 8వ తేదీ జిల్లా యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యువజనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నాగలక్ష్మి, యువజన సంక్షేమ శాఖాధికారి టీడీ విజయలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో పోటీలు జరుగుతాయని తెలిపారు. ఇందులో థీమాటిక్ విభాగంలో సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రాజెక్టులు ప్రదర్శించవచ్చునని తెలిపారు. కల్చరల్ విభాగంలో గ్రూపు ఫోక్‌డ్యాన్స్, గ్రూపు ఫోక్‌సాంగ్స్, సోలో ఫోక్‌సాంగ్, సోలో ఫోక్‌డ్యాన్స్ పోటీలు ఉంటాయని తెలిపారు. లైఫ్ స్కిల్స్ విభాగంలో పోయట్రీ, స్టోరీ రైటింగ్, పెయింటింగ్, డిక్లమేషన్(ప్రకటన) విభాగాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. ఎంట్రీలు https://bit.ly/dyf-guntur24 అనే వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 0863-2234176, 9398693990లో సంప్రదించాలన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

గుంటూరు(తూర్పు), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళా వేదికగా నటరాజ సంగీత నృత్య కళా శాల 19వ వార్షిక వేడుకలు ఘనంగా జరిగాయి. సభకు నాట్య గురువు ఏ.విజయకుమారి అధ్యక్షత వహించారు. కార్యక్రమాన్ని ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహకార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, నాట్యాచార్యులు డాక్టర్ కాజా వెంకటసుబ్రహ్మణ్యం ప్రారంభించారు. అనంతరం పలు భక్తి కీర్తనలకు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి, జానపద నృత్యాలు ప్రేక్షకులను ఆలరించాయి. అనంతరం కళాకారులను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమాన్ని అనంతుల ప్రణయనాథ్‌రెడ్డి, విజయకుమారి పర్యవేక్షించారు.

కనకదుర్గమ్మ దేవాలయ వార్షికోత్సవం

గుంటూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పొన్నూరు రోడ్డు సంగడిగుంట వద్ద ఉన్న శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానం వార్షిక వేడుకలు మంగళవారం ఆలయంలో వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే అమ్మవారికి ప్రత్యేక అర్చనలు, కుంకుమ పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు మారెడ్డి శ్రీనివాసరెడ్డి, మద్దిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, ట్రెజరర్ కల్లి శ్రీనివాసరెడ్డి పలువురు సభ్యులు ఆలయ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్రీడాకారులకు అభినందనలు

గుంటూరు(తూర్పు), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): నంద్యాలలో ఈ నెల 3న జరిగిన రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ గేమ్స్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. టీం చాంపియన్ షిప్‌ను సాధించి జిల్లాను మూడో స్థానంలో నిలిపారు. అంతేగాక బీఆర్ స్టేడియానికి చెందిన పి.మోక్షితారెడ్డి కాంస్య పతకాన్ని సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా క్రీడా భివృద్ధి అధికారి పి.నరసింహారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. పతకం సాధించిన పి.మోక్షితా రెడ్డి గుజరాత్‌లో జరిగే జాతీయ టేబుల్ టెన్నిస్ పోటీల్లో పాల్గొంటుందని వివరించారు. కార్యక్రమంలో కోచ్ జి.నరసింహారావు తది తరులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ సంఘంలో కష్టపడిన వారికే అవకాశాలు ఇవ్వాలి

గుంటూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని గుర్తింపు ఉన్న దేవాలయాల్లో బోర్డు సభ్యులుగా నాయీబ్రాహ్మణ అసోసియేషన్‌లో కష్టపడిన వారికి అవకాశాలు ఇచ్చే విధంగా కృషి చేయాలని టీటీడీ ట్రస్టు బోర్డు వైద్య శాంతారామ్‌ని ఏపీ నాయీబ్రాహ్మణ జేఏసీ ప్రతినిధి వర్గం కోరింది. మంగళవారం నగరానికి వచ్చిన శాంతారామ్‌ను కలసిన నాయీబ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్య క్షుడు తాటికొండ నరసింహారావు దేవాలయాల కళ్యాణకట్టలలో అవకతవకలకు తావు లేకుండా చూడాలని కోరుతూ మెమోరాండం అందించారు. శాంతారాం స్పందిస్తూ సమీక్షలు నిర్వహించి సభ్యుల నియమామకంలో కుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి నాయీబ్రాహ్మణులకు ఇబ్బంది వాటిల్లకుండా చూస్తానని హామీ ఇచ్చారు.

పారిశుధ్యం విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి



21వ డివిజన్లో డ్రైనేజీలను శుభ్రం చేయిస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో పారిశుధ్యం విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే గళ్లా మాధవి తేల్చి చెప్పారు. 'మీ తోనే నేను - మీ వెంటే నేను' కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆమె 21వ డివిజన్ అంతటా స్పెష ల్ శానిటరీ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'మీ వెంటే నేను' కార్యక్రమం ద్వారా డివిజన్ అంతటా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం చేపట్టామని, ఆ కార్యక్ర మంలో 80మంది పారిశుధ్య కార్మికులు పాల్గొని, డివిజన్‌ను శుభ్రం చేశారని తెలిపారు. రెండు రోజుల పాటు ఈ స్పెషల్ శానిటరీ డ్రైవ్ ఉంటుందన్నారు. నియోజకవర్గంలో రోడ్లు వేయిస్తామని, వెలగని విద్యుత్ దీపాలు గుర్తించి సరిచేస్తామని అన్నారు. గత ప్రభుత్వం క్లీన్ ఆంధ్ర పేరుతో ఈ చెత్త డబ్బాలను ఎత్తి వేసి, ఎలక్ట్రికల్ వాహనాలు కొనుగోలు చేసి వాటిని వాడకుండా మూలనపెట్టడంతో అవి పాడైపోయి చెత్త నిర్వహణ మొత్తం అస్తవ్యస్తంగా మారిందని విమర్శించారు. వీటిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజల నుంచి వినతుల స్వీకరణ

గుంటూరులోని తన క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పింఛన్లు, దివ్యాంగులు, రోడ్డు పక్కన చిరు వ్యాపారులు తమ సమస్యలపై ఆమెకు వినతిపత్రాలు అందజేశారు. వారి సమస్యలు పరిష్కరిస్తామని, చిరు వ్యాపారులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు ఇచ్చి తగిన రక్షణ కల్పిస్తామని ఆమె హామీ ఇచ్చారు.

సభ్యత్వ నమోదులో సరికొత్త రికార్డు సృష్టించాలి

గుంటూరు పశ్చిమలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వాన్ని అత్యధికంగా నమోదును చేసి సరికొత్త రికార్డ్ సృష్టించాలని ఎమ్మెల్యే గళ్లా మాధవి పిలుపునిచ్చారు. టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షులు, క్లస్టర్, కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించారు. ప్రతి డివిజన్లో రెండు వేలకు పైగా సభ్యత్వాలు నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోవెలమూడి రవీంద్ర, సింహాద్రి కనకాచారి, మద్దిరాల మ్యాని, వేములపల్లి శ్రీరాం ప్రసాద్, శ్రీవల్లి, కొమ్మినేని కోటేశ్వరరావు, ఈరంటి వరప్రసాద్, కసుకుర్తి హనుమంతరావు, సుఖవాసి శ్రీనివాసరావు, అడకా శ్రీనివాస్, లాల్ వజీర్ తదితరులు పాల్గొనారు.

ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం ప్రధాన కార్యదర్శిగా కోటమ్మ

గుంటూరు మెడికల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గుంటూరు జీజీహెచ్‌కు చెందిన ఎస్ కోటమ్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా జీజీహెచ్‌కు చెందిన ఆశాలత ఎన్నికయ్యారు. కోటమ్మ ప్రస్తుతం జిల్లా ప్రభుత్వ నర్సుల సంఘం అధ్యక్షురాలిగా వ్యవహరిస్తున్నారు. గుంటూరు జీజీహెచ్ నుంచి సంఘం రాష్ట్ర కార్యవర్గంలో ఇద్దరికి స్థానం లభించడంపై నర్సులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వాస్పత్రి శుశ్రుతహాల్లో మంగళవారం అభినందన సభ నిర్వహించారు. ఇద్దరిని ఘనంగా సన్మానించారు. రెండు దశాబ్దాలుగా సంఘంలో చురుకైన పాత్ర పోషిస్తున్న ఆవుల విజయకుమారిని కూడా ఈ కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. గత నెల 23న జరిగిన జిల్లా ప్రభుత్వ నర్సుల సంఘం ఎన్నికల్లో తమ ప్యానల్‌ను గెలిపించినందుకు జిల్లాలో పని చేసే నర్సులకు అధ్యక్ష, కార్యదర్శులు కోటమ్మ, పద్మజ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ప్రభుత్వ నర్సుల సంఘం తరఫున ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్విని కలసి నర్సింగ్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో నర్సింగ్ స్కూల్‌కు సొంత భవనం నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. నర్సుల సమస్యలను పరిష్కరిస్తానని డాక్టర్ రమణ యశస్వి హామీ ఇచ్చారు.



విజయోత్సవ సభలో నర్సుల సంఘం ప్రతినిధులు

జన్మభూమి రుణం తీర్చుకున్న మంత్రి లోకేశ్

● తెలుగు యువ త జిల్లా అధ్యక్షుడు రావిపాటి

గుంటూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అమె రికా పర్యటన ద్వారా బ్రాండ్ ఏపీకి పునరుజ్జీ వం పోసి 500 కంపెనీల సీఈవోలతో భేటీ అయి పెట్టుబడుల ఆకర్షణ, తద్వారా ఉద్యోగ కల్పన కోసం కృషి చేస్తున్న మంత్రి లోకేశ్ జన్మ భూమి రుణం తీర్చుకున్నారని తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు రావిపాటి సాయికృష్ణ కొనియాడారు. అమెరికా పర్యటన పూర్తి చేసుకుని తిరిగి రాష్ట్రానికి వచ్చిన ఆయనను గన్నవరం విమానాశ్రయంలో కలిసి సాయికృష్ణ స్వాగతం పలికారు. ఆయన మాట్లాడు తూ ఫార్చ్యూన్ 500 కంపెనీల సీఈవోలు, ప్రతి నిధులతో భేటీ అయి సీఎం చంద్రబాబు విజన్, ఏఈపీ పాలసీలు, అనుకూలతలను వివ రించి, వారిని రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఆహ్వానించడంలో లోకేశ్ సక్సెస్ అయ్యారని అన్నారు. దీనివల్ల రాష్ట్రంలోని యువతకు ఉపాధి కల్పన, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి



రవీంద్రనగర్ శివాలయంలో ఉన్న నాగేంద్ర స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

గుంటూరు(తూర్పు), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): నాగుల చవితి పర్వదినాన్ని పురస్క రించుకొని నగరంలోని పలు శివాలయాలలో, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాల్లో, పు ట్టల్లో మంగళవారం నాగుల చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని పుట్టల్లో పాలు పోసి, నానబెట్టిన సజ్జలు, చలి విడిని నైవేద్యంగా సమర్పించారు. బ్రాడీపేటలోని ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలోని పుట్ట వద్ద, అరండల్‌పేట శివాలయం, సంపత్‌నగర్ రామనామ క్షేత్రం, అరండల్‌పేట అష్టలక్ష్మి ఆలయం, శ్రీనివాస రావు పేటలోని 60 అడుగుల రోడ్డులోని సుబ్రహ్మణ్య స్వామి పుట్ట, రవీంద్రనగర్‌లోని నాగేంద్రస్వామి పుట్ట, ఆర్టీవో కార్యాలయం, ఎస్పీ బంగ్లా రోడ్డులోని నాగేంద్ర స్వామి పుట్టల వద్ద అధిక సంఖ్యలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

లక్షలు గుంజారు.. వైద్యం విషయంలో చేతులెత్తేశారు

● ప్రైవేట్ హాస్పిటల్ వైద్యుల నిర్వాకంపై రోగి బంధువుల ఆందోళన

గుంటూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): లక్షల రూపాయలు ఫీజుల రూపంలో గుంజారే గానీ వైద్యం విషయంలో మాత్రం చేతులెత్తేశారని రోగి బంధువులు కొత్తపేటలోని ప్రైవేటు ఆస్పత్రి ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళితే.. క్రోసూరు మండలం నాగవరం గ్రామానికి చెందిన పులిబండ్ల లక్ష్మణరావు లివర్ ఇన్ఫెక్షన్‌తో కొత్తపేటలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేరాడు. 5 రోజులుగా వైద్యం చేస్తూ 3 లక్షల తీసుకుని పేషేంట్ ప్రాణాలు పోయే వరకు చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. సరైన వైద్యం చేయకుండా ప్రాణాపాయ స్థితికి చేరుకున్నాక వైద్యులు చేతులెత్తేస్తున్నారని బాధితులు వాపోయారు. వైద్యులు నిర్లక్ష్యం వహించారని ఆరోపిస్తూ బాధితులు ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న కొత్తపేట సీఐ వీరయ్య ఘటనా స్థలికి చేరుకుని బాధితులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సీఐ జోక్యంతో బాధితులు ఆందోళన విరమించారు.

శాంతిభద్రతల సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టండి : ఎస్పీ

గుంటూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : క్షేత్రస్థాయిలో సిబ్బంది సహకారంతో శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశించారు. ఆయన వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం పట్టాభిపురం స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసారు. పోలీసు స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, సిబ్బంది విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్‌లో నిర్వహిస్తున్న కేసు డైరీ, వివిధ క్రైమ్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. రౌడీషీటర్ల కదలికలు, కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శుల(మహిళా పోలీస్) సహకారంతో ఆయా వార్డుల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి సమాచారం తీసుకొని, వారికి తగిన కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులతో మాట్లాడి వారు నిర్వహిస్తున్న విధులు, వారు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో ఎవరికైనా ఎటువంటి సమస్య తలెత్తినా స్థానిక పోలీస్ స్టేషన్ అధికారికి గానీ, ఎస్పీ దృష్టికి గాని తీసుకురావాలని వారికి తెలియజేశారు. మహిళలపై జరిగే నేరాలకు సంబంధించిన కేసులు, ప్రాపర్టీ కేసులు, రోడ్డు ప్రమాదాలు, అనుమానాస్పద కేసుల రికార్డ్సును పరిశీలించారు. నేరాలు అరికట్టేందుకు పగలు, రాత్రి పోలీస్ గస్తీ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ డీఎస్పీ జయరాం ప్రసాద్, సీసీ ఆది శేషు, పట్టాభిపురం సీఐ వీరేంద్రబాబు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి ఐదు రోజుల జైలు

గుంటూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ డీఎస్పీ రమేష్ పర్యవేక్షణలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన వారిలో ఇద్దరికి కోర్టు జైలు శిక్ష విధించింది. పట్టుబడిన మందుబాబులను మంగళవారం కోర్టులో హాజరుపరచగా పరచగా జడ్జి కె.లత వారిద్దరికి ఐదు రోజుల జైలు శిక్ష విధించారు.



రోడ్డుపై లీకులను పరిశీలిస్తున్న కమిషనర్ కమిషనర్ పులి శ్రీనివాసులు

విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న ఏఈ నాగవేణి సస్పెన్షన్

● నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై కేటాయించిన విధుల్లో నిర్లక్ష్య వైఖరి కనబరచిన ఏఈ నాగవేణిని విధుల నుంచి సస్పెండ్ చేసి ఈఎన్సీకి సిఫార్స్ చేయాలని ఎస్ఈని, ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యవైఖరి ప్రదర్శిస్తున్నారని స్థానికుల ఫిర్యాదు మేరకు బొంతపాడు (194 వార్డ్ సచివాలయం) శానిటేషన్ కార్యదర్శి బి.బోడెయ్యను విధుల నుంచి సస్పెండ్ చేయాలని సీఎంవోహెచ్‌ని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం కమిషనర్ కేవీపీ కాలనీ, అంకిరెడ్డిపాలెం, చౌడవరం, బుడంపాడు, బొంతపాడు ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల ఏర్పాటు, సంజీవయ్యనగర్ గేటు దగ్గర తాగునీటి ప్రధాన పైప్‌లైన్ ఇంటర్ కనెక్షన్, లీకులను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శివనాగరాజు కాలనీ పట్టణ ఆరోగ్య కేం ద్రాన్ని పరిశీలించి, ప్రతి రోజు వస్తున్న అవుట్ పేషెంట్ వివరాలను రిజిస్టర్‌లో తనిఖీ చేసి, స్థానిక ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. పర్యటనలో ఈఈ సుందర్రామిరెడ్డి, డీఈఈలు సతీష్, కళ్యాణరావు, ఏఈలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచి వాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

నిర్దిష్ట లక్ష్యాలను అధికారులు అధిగమించాలి

● పేరేచర్ల హౌసింగ్ స్కీంపై కమిషనర్ పులి శ్రీనివాసులు సమీక్ష

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ హౌసింగ్ లే అవుట్స్‌లో ఇళ్ల నిర్మాణ పనుల కాంట్రాక్టు పొందిన కాంట్రాక్టర్లు పనులు వేగవంతం చేసి, డిసెంబర్ నెలలో తమ నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేసేలా హౌసింగ్, నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు ప్రతి రోజు పర్యవేక్షించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థ లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించిన పేరేచర్ల లే అవుట్‌లో హౌసింగ్ పీడీ, ఇంజనీరింగ్, హౌసింగ్ డిపార్టుమెంట్ అధికారులు, ఎమినిటి కార్యదర్శులు, కాంట్రాక్టర్లతో లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. కమిషనర్ తొలుత లే అవుట్ లో కాంట్రాక్టర్ల వారీగా ఇళ్ళ నిర్మాణం ఏ మేరకు పూర్తయింది, గ్రౌండ్ లెవల్ ఎన్ని ఉన్నది, మౌలిక వసతులు, బిల్స్ చెల్లింపు, ఇసుక, సిమెంట్, ఇనుము లభ్యత తదితర అంశాలను అధికారులను, కాంట్రాక్టర్లను అడిగీ తెల్సుకొని, మాట్లాడుతూ డిసెంబరు నెలలో లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేసేలా హౌసింగ్ లే అవుట్స్‌లో ఇళ్ల నిర్మాణపనులు కాంట్రాక్టర్ల వారీగా ఇచ్చిన టైం లైన్ మేరకు చేపట్టాలని, నిర్మాణ పనుల కాంట్రాక్ట్ పొందిన వారు అవసరమైన కార్మికులను సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ ప్రసాద్, ఈఈ శంకరరావు, నగరపాలక సంస్థ ఈఈ సుందర్రామిరెడ్డి, నగరపాలక సంస్థ, హౌసింగ్ డీఈఈలు, ఏఈలు, నోడల్ అధికారులు, మైనింగ్ అధికారులు పాల్గొన్నారు.



వర్క్‌షాపులో పరికరాలు గురించి తెలుసుకుంటున్న విద్యార్థులు

చిప్స్ కళాశాలలో ఎనలైటికా వర్క్‌షాపు

గుంటూరు(విద్య), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని చేబ్రోలు హనుమ య్య ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో మంగళవారం డ్రగ్స్ టెస్టింగ్ ఆధ్వర్యంలో వర్క్‌షాపు నిర్వహించారు. ల్యాబ్‌లో ఉన్న ఎనలైటికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ పనితీరు గురించి విద్యార్థులకు నిపుణులు వివరించారు. వర్క్‌షాపునకు జేకేసీ కళాశాల నుంచి 200మంది విద్యార్థులు హాజరయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యదేవర విద్యాధర వెల్లడించారు. ల్యాబ్‌లో ఉన్న హైప్రెజర్ లిక్విడ్ క్రొమాటోగ్రఫీ, గ్యాస్ లిక్విడ్ క్రోమేటోగ్రఫి, అల్ట్రావైలెట్, హిమాటో ఎనలైజర్ తదితర పరికరాల గురించి విద్యార్థులకు నిపుణులు వివరించారు. ఒక్కో ఇన్‌స్ట్రుమెంట్ ప్రయోగం ఔషధాల తయారీలో దాని పాత్ర గురించి వివరించారు.

నీటి పన్నులు చెల్లించిన వారికే అర్హత : జేసీ

గుంటూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 1433 నుంచి 1434 ఫసలీలు (2023, 2024 సంవత్సరాల) కోసం నీటి పన్ను వసూలు మాడ్యూల్ ఇంకా ఆన్‌లైన్‌లో ప్రారంభించలేదని జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ తేజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని దృష్ట్యా 1432 ఫసలీ వరకు అన్ని నీటి పన్నుల బకాయిలు చెల్లించిన రైతులు నీటి సంఘాల ఎన్నికల్లో ఏ రైతు సంస్థలోనైనా పోటీ చేయడానికి అనుమతి ఉంటుందన్నారు.

కోదండ రామాలయంలో అయ్యప్ప భక్తులకు సద్ది

గుంటూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): స్తంభాలగరువు కోదండ రామాలయంలో వరుస గా 13వ సంవత్సరం అయ్యప్ప భక్తులకు సద్ది కార్యక్రమం ఏర్పాటు చేశారు. శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో ఆలయ సమితి సౌజన్యంతో డిసెంబరు 8వ తేదీ వరకు సద్ది కార్యక్రమం కొనసాగుతుందని దేవస్థానం కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. నిత్యం రెండు వేల మందికి పైగా అయ్యప్ప భక్తులు సద్దికి వస్తున్నారని చెప్పారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

ప్రభుత్వాస్పత్రిని నూతన హంగులతో ఆధునికీకరిస్తాం

● తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్

గుంటూరు మెడికల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో కార్పొరేట్ వైద్యశాలల కన్నా అత్యాధునిక సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయన మంగళవారం ప్రభుత్వాస్పత్రిలో పర్యటించారు. ఈ పర్యటనలో ఎమ్మెల్యేతో పాటు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి, ఏపీ ఎంఎస్ఐడీసీ డీఈఈ హనుమంతరావు నాయక్, ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అశోక్ పాల్గొన్నారు. ఆస్పత్రిలో పలు విభాగాలను నసీర్ పరిశీలించారు. నిర్మాణ దశలో ఉన్న సర్వీస్ బ్లాక్‌ను, రూ.100 కోట్లతో చేపట్టిన మాతా శిశు సంరక్షణ విభాగాన్ని త్వరలో పూర్తి చేస్తామని ఆయన వెల్లడించారు. బొంగరాలబీడులో ఉన్న ఆరెకరాల ప్రభుత్వాస్పత్రి స్థలంలో త్వరలో డెంటల్, ఈఎన్‌టీ, ఆప్తమాలజీ విభాగాలను తరలించి ప్రభుత్వాస్పత్రిలో రోగులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

నిరంతరాయ విద్యుత్ సరఫరాకు ప్రత్యేక ప్రణాళికలు

● సీపీడీసీఎల్ ఇన్‌ఛార్జ్ ఎస్ఈ మూర్తి



గుంటూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): నిరంతరాయ విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేక ప్రణాళికలతో పని చేస్తున్నాం. ప్రతి నెలలో సమస్యలున్న ఐదు ట్రాన్స్‌ఫార్మర్లను ఎంపిక చేసుకొని మరమ్మతులు పూర్తి చేసేలా ప్రత్యేక బృందాలను సిద్ధం చేశామని సీపీడీసీఎల్ ఇన్‌చార్జ్ ఆపరేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ) కేవీఎల్ఎన్ మూర్తి తెలిపారు.



సర్కిల్ పరిధిలో విద్యుత్ వినియోగం ఎంత జరుగుతోంది?

ఎస్ఈ : విభజిత గుంటూరు సర్కిల్ పరిధిలోని గుంటూరు టౌన్-1, తెనాలి డివిజన్‌లలో నిత్యం 5.5 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరుగుతుంది. ప్రస్తుతానికి ఎటువంటి ఇబ్బంది లేదు. వేసవిలో వినియోగం మరింత పెరగనున్నది. ఎటువంటి సాంకేతిక లోపాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

కొత్త సబ్‌స్టేషన్‌లకు ఏమైనా ప్రతిపాదనలు ఉన్నాయా?

ఎస్ఈ : నగరంలో కొత్తగా సబ్‌స్టేషన్ ఏర్పాటు కోసం ప్రయత్నాలు చేస్తున్నాం. ఇందు కోసం మూడెకరాల స్థలం అవసరమవుతుంది. అధికారులను సంప్రదించి స్థలసేకరణ కూడా చేపడుతున్నాం. ఇప్పటికే ఏఎన్‌యూలో సబ్‌స్టేషన్ పనులకు టెండర్ల దశ కూడా పూర్తయింది. త్వరలో అందుబాటులోకి రానున్నది.

త్రీ ఫేజ్ మీటర్లు, కండక్టర్లు కొరతగా ఉందని ఫిర్యాదులొస్తున్నాయి?


ఎస్ఈ : అవసరాలకు అనుగుణంగా త్రీ ఫేజ్ మీటర్లు, కండక్టర్లను స్టోర్‌కు తెప్పించాం. సెక్షన్ పరిధిలో ఎక్కడా ఫిర్యాదులేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

గృహాలకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఎప్పుడు చేస్తున్నారు?

ఎస్ఈ : స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ ప్రస్తుతం ప్రభుత్వ కార్యాయాలకు జరుగుతోంది. ఇది పూర్తయ్యాక వాణిజ్య కనెక్షన్లు, పరిశ్రమలు, ఆక్వా కనెక్షన్లకు స్మార్టు మీటర్లు ఏర్పాటు చేస్తా రు. ఆ తరువాత గృహాలకు కూడా ఏర్పాటు చేసే అవకాశం ఉండొచ్చు.

విద్యుత్ సరఫరాలో అంతరాయాలపై ఫిర్యాదులొస్తున్నాయి?

ఎస్ఈ : విద్యుత్ సరఫరాలో సాంకేతిక సమస్యలేకుండా చర్యలు తీసుకుంటున్నాం. రోడ్డు పక్క న వృక్షాలతో పాటు కేబుల్ వైర్లు కూడా కారణంగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే కేబుల్ వాళ్ళకు సూచనలు చేశాం.



అల.. వైకుంఠపురములో.. అన్నీ సమస్యలే !

కలియుగ ప్రత్యక్షదైవం శ్రీ వెంకటేశ్వరస్వామి కొలువుదీరి ఉన్న దేవస్థానమది. తిరుమల తిరుపతి తరువాత అంతగొప్పగా విరాజిల్లుతున్న దేవస్థానం తెనాలి వైకుంఠపురం శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామివారి ఆలయం. ఈ ఆలయానికి తెనాలి పరిసర ప్రాంతాల నుండే కాకుండా తెలుగురాష్ట్రాలు, ఇతర ప్రాంతాలనుండి వేలాది భక్తులు స్వామి వారి దర్శనానికి వచ్చిపోతుంటారు. తిరుమల తిరుపతిలో స్వామి వారికి జరిగే విధంగానే ఇక్కడ కూడా పూజాదికార్యక్రమాలు జరపడం ఈ దేవస్థానం ప్రత్యేకత. ఆలయంలో సౌకర్యాలు నామమాత్రంగా ఉండటంతో భక్తులకు అవస్థలు తప్పడంలేదు.



కేశఖండనశాల కూల్చివేసిన పాత భవనం



గోశాలలో పొంగలి చేస్తున్న భక్తులు

- యాగశాల కాస్త కేశఖండన శాలగా మార్పు
- గోశాల కాస్త పొంగలిషెడ్డుగా మార్పు
- శంకుస్థాపన తోనే నిలిచిన కేశ ఖండనశాల
- దుస్తులు మార్పు గదులు లేక భక్తులు ఇబ్బంది

తెనాలి రూరల్, నవంబరు 5: తెనాలి వైకుంఠపురం శ్రీ లక్ష్మీపద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామివారి దేవస్థానంలో స్వామివారికి యజ్ఞపూజలు జరిపేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక యజ్ఞశాల నేడు కేశఖండనశాలగా మారింది. కోట్లాదిమంది దేవతలను పూజించిన ఫలం ఒక్క గోపూజతోనే సాధ్యమని పురణాలు, పండితులు చెబుతుంటారు. దేవస్థాన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గోశాల కాస్త పొంగలిషెడ్డుగా మార్చి గోవులు చెట్లకిందకు చేరాయి.



తల నీలాలు సమర్పించిన అనంతరం ఆరుబయటే బట్టలు మార్చుకుంటున్న భక్తుడు



గోశాల పొంగలిషెడ్డుకావడంతో చెట్లకింద ఉన్న గోవులు

దీంతో భక్తులకు గోపూజ దూరమయింది. దేవస్థానంలో సౌకర్యాలు మెరుగుపరుస్తూ భక్తుల మన్ననలు పొందాల్సి ఉండగా ఉన్న సౌకర్యాలు మరుగునపడుతుండటంతో స్వామివారి సేవకు వచ్చే భక్తులు గోవిందగోవింద అంటూ లెంపలేసుకుంటున్నారు.

కేశఖండనశాలకు శంకుస్థాపనతోనే సరి

ఆలయంలో భక్తులు స్వామివారి మొక్కుబడులు తీర్చుకునేందుకు ఏర్పాటు చేసిన కేశఖండనశాల భవనాన్ని గత వైసీపీ ప్రభుత్వంలో నేటమట్టం చేసి నూతన భవనాన్ని నిర్మించేందుకు అప్పటి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ శంకుస్థాపన చేశారు. అనంతరం పాత భవనాన్ని పూర్తిగా నేలమట్టం చేయకుండా పిల్లర్లవరకు ఆపి పనులు నిలిపివేశారు.

గోశాల కాస్త పొంగలిషెడ్డు

హిందువులు అత్యంత పవిత్రంగా గోవులను పూజిస్తారు. శాస్త్ర ప్రకారం వైకుంఠపురం ఆలయంలో గోవులను సంరక్షించేలా గోశాలను నిర్మించారు. ఐతే పొంగలి చేసుకునేందుకు ప్రత్యేక షెడ్డులేకపోవడంతో గోవులను చెట్లకింద కట్టివేసి గోశాలను పొంగలి షెడ్డుగామార్చారు.

ఆలయ కలశప్రతిష్ఠతోనే నిలిచిన పనులు

శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామివారి ఆలయంలో నూతనంగా నిర్మించిన కలశప్రతిష్ఠతో తదనంతరం జరగవల్సిన పనులు నిలిచిపోయాయి. ఆలయ పర్యవేక్షకులు వాటిపై దృష్టిపెట్టి పనులు పూర్తిచేయాలని చూడాలని కోరుతున్నారు.

కేశ ఖండన టిక్కెట్టు రూ.40.. సిబ్బందికి మరో రూ.40

నాపేరు రామారావు మాది ఈమని గ్రామం. స్వామివారిని దర్శనంచేసుకుని తలనీలాలు సమర్పించేందుకు వైకుంఠపురం శ్రీ లక్ష్మీపద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామివారి దేవస్థానానికి వచ్చా. అయితే కేశఖండనకు రూ.40 పెట్టి టిక్కెట్టు తీసుకున్నా. ఇక్కడకి వచ్చి చూస్తే స్నానం చేసేందుకు కూడా సౌకర్యాలు లేవు. పాత భవనం కూల్చివేసి యాగశాలలో కేశఖండనశాల పెట్టారు. అందులోకి వెళ్లితే అక్కడ సిబ్బంది తలనీలాలకు రూ.40 ఇవ్వాలన్నారు. రూ.30 ఇచ్చి వచ్చాను. కుటుంబసమేతంగా ఆలయానికి వస్తే మహిళలు ఇబ్బందులు పడక తప్పదు. దుస్తులు మార్చుకునేందుకు సరైన వసతులు లేవు.



యాగశాలలో కేశఖండనశాల

పవిత్రమైన యజ్ఞశాలలోనే కేశఖండనశాల

యజ్ఞయాగాదులు జరిగే పరమపవిత్రమైన యాగశాలను కేశఖండన శాలగా మార్చారు. అక్కడ తలనీలాలు సమర్పించేందుకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తప్పడంలేదు. తలనీలాలు సమర్పించే సమయంలో నీటితో తలతడుపుకునేందుకు అనంతరం స్నానాలు చేసేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించలేదు. స్త్రీ, పురుషులు బహిరంగంగా కుళాయిల కింద స్నానాలు చేసి ఆరుబయట దుస్తులు మార్చుకునే పరిస్థితి నెలకొంది. స్త్రీలకు మాత్రం చిన్నపాటి బాత్రూమ్‌లు ఉండగా వందలాదిగా వచ్చే మహిళలకు అది చాలకపోవడంతో పాటు బట్టలు మార్పుచేసుకునే ప్రాంతంలో పై కప్పుకూడా లేకపోవడంతో రక్షణలేకుండా పోయింది.




సమావేశంలో మాట్లాడుతున్న వజ్రాల వెంకట నాగిరెడ్డి

విత్తనాలు నమూనా తీసే విధానం మార్చాలి

- పరీక్షల్లో నకిలీ అని తేలితే కంపెనీలను ఏ1గా చేర్చాలి
- రాష్ట్ర సీడ్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

గుంటూరు సిటీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ విత్తనాల నమూనా తీసే విధానంలో సమూల మార్పులు తీసుకురావాలని రాష్ట్ర ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్‌చేసింది. మంగళవారం గుంటూరులో రాష్ట్ర విత్తనవిక్రేతల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వజ్రాల వెంకటనాగిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ హైబ్రిడ్ మిరప విత్తనాలు నమూనా తీసినప్పుడు 450 గ్రాముల బరువు కలిగిన మూడు సీల్ ప్యాకెట్లు ఓపెన్ చేస్తున్నారని అన్నారు. అందులో ఒక్కొక్క ప్యాకెట్ నుంచి 10గ్రాములు నమూనా కింద అధికారులు తీసుకుంటున్నారని, మిగిలిన ప్యాకెట్లు ఎవరూ కొనడంలేదన్నారు. దానివల్ల విత్తనాల వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారని ఇటువంటివిధానం వెంటనే మార్చాలని పేర్కొన్నారు. విత్తనాల నమూనా సేకరించి ల్యాబ్‌కి పంపిన తర్వాత అవి నకిలీ అని తేలితే వ్యాపారులను ఏ1 గా చేర్చుతున్నారని అన్నారు. సీల్ ప్యాకెట్ నుంచి విత్తనాలు సేకరించి అవి నకిలీ అని తేలితే కంపెనీ యజమానులను వదిలిపెట్టి, వ్యాపారులను నిందితులుగా చేర్చటాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. విత్తనాలు నకిలీ అని తేలినప్పుడు కంపెనీ యజమానులను ఏ1 గా చేర్చి, వ్యాపారులను సాక్షిగా ఉంచాలని అన్నారు. బీజీ-2 కాటన్ విత్తనాలు నమూనా తీస్తుంటే, హెచ్ టీ ఆనవాళ్లు ఉన్నట్లు కొన్ని ల్యాబ్‌ల్లో వస్తుండడం పట్ల కూడా వ్యాపారులు ఆందోళన చెందుతున్నారని నాగిరెడ్డి పేర్కొన్నారు. జీఓటీ, జెర్మినేషన్ ఇంత శాతం ఉందని వ్యవసాయ శాఖ నిర్ధారించిన తర్వాత వాటిని అమ్ముతున్న సమయంలో వస్తున్న సమస్యలకు విత్తనాల వ్యాపారులను బాధ్యులను చేయడం సబబు కాదని అన్నారు. చిన్న చిన్న కంపెనీలు వారికి సంబంధించిన విత్తనాలు అమ్మకాలు జరుపుతున్నాయని, ఆ తర్వాత ఏదైనా సమస్య వస్తే రైతులు వ్యాపారులను ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. దాన్ని నివారించేందుకు విత్తనాలు సరఫరా చేస్తున్న చిన్న కంపెనీలు రైతుల కోసం టోల్ ఫ్రీ నెంబర్ కూడా ఏర్పాటు చేయాలని డిమాండ్‌చేశారు. త్వరలోనే వ్యవసాయ ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయాలు తీసుకువెళ్తామని నాగిరెడ్డి అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర అసోసియేషన్ కోశాధికారి విజయ్ కుమార్, ఉపాధ్యక్షులు శ్రీనివాస రెడ్డి, పరమేశ్వర రెడ్డి, కార్యదర్శి చలపతిరావు, గుంటూరు జిల్లా ఛైర్మన్ సాంబిరెడ్డి, పల్నాడు జిల్లా ఛైర్మన్ హనిమిరెడ్డి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, 26 జిల్లాల నుంచి ముఖ్యమైన విత్తన డీలర్లు పాల్గొన్నారు.



ఏడో శతాబ్దం లోని రూపులమ్మ దేవి ఆలయం

రూపులమ్మ.. కనబడవమ్మ

చరిత్ర బావి తరాలకు అతి భద్రంగా అందించాల్సిన అద్భుత సంపద. కనుమరుగు కాకుండా కాపాడుకోవాల్సిన అపురూప సంస్కృతి, ఘనమైన చరిత్రకు నిర్లక్ష్యం వలన రూపులమ్మ ఆలయం పూర్తిగా శిథిలమైపోయింది. ఆలయ గోపురం తప్ప ముఖద్వారమంతా చెరువులో పూడికమట్టితో మునిగిపోయింది. కనీసం మట్టి తొలగించి, అప్పటి ఆలయ విగ్రహాలను పరిరక్షించాల్సిన పురావస్తుశాఖ నిమ్మకు నీరెత్తినట్లుగా ఉంది. ఆ కాలపు మాన్యుమెంట్స్ ఏమున్నాయోనని పరిశోధించాల్సిన అధికారులు, ఈ ఆల యానికి తమ రికార్డుల్లో ఓ గుర్తింపునిచ్చి వదిలేశారు. రూపులమ్మగా, మహాలక్ష్మీ దేవమ్మగా ఆ కాలంలో ఓ వెలుగు వెలిగిన ఈ ఆలయాన్ని సంరక్షించాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది. ఇక్ష్వాకులు, బుద్ధులు, జైనులు, శాతవాహనులు, చాళుక్యులు, హైహయరాజులు పాలించిన ఈ ప్రాంతాన్ని టూరిజం కేంద్రంగా అభివృద్ధి పరచాల్సిందిపోయి శిథిలాలను మరింత శిథిలావస్థకు చేరుస్తున్నారని ఈ ప్రాంత ప్రజలు విమర్శిస్తున్నారు.

గోపురం పదిలం 'అమ్మ' శిథిలం

'పల్నాడు' అంటే అనుగురాజు, ఆయన కుమారులు నలగామ రాజు, మలిదేవరాజులు.. వారి మధ్య జరిగిన యుద్ధం.. ఇది మాత్రమే చాలా మందికి తెలుసు. కానీ, పల్నాట బాదామి చాళుక్యుల ఉనికి ఎంత మందికి తెలుసన్నది ప్రశ్నార్థకమే. కాల గర్భాన గతించిన చరిత్రలెన్నో నాటి కాలపు నిర్మాణాలతో వెలుగు చూసినా ఆదరణకు మాత్రం నోచుకోవడం లేదు. మన పక్కనే ఉన్నప్పటికీ గుర్తించలేని స్థితిలో ఉన్నాయి.

- బాదామి చాళుక్యల కాలం నాటి రూపులమ్మ ఆలయం
- దుర్గి మండలం తేరాలలో శిథిలావస్థకు
- పూడిక మట్టిలో ముఖద్వారం

మాచర్లటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశాన్ని క్రీస్తు శకం 6-12 శతాబ్దాల మధ్య చాళుక్యులు పరిపాలించారు. 2వ శతాబ్దంలో ఇక్ష్వాకుల సామంతులుగా ఉండే వీరు పల్లవుల ధాటికి తాళలేక కర్ణాటక వచ్చి స్థిరపడ్డట్లు చరిత్ర చెబుతోంది. అటు నుంచి రాయలసీమలోని కడప, కర్నూలుకు కూడా వీరి రాజ్యం విస్తరించింది. కర్ణాటకలో తమ స్వాధీనంలో లేని బాదామి ప్రాంతంలో కదంబులను ఓడించిన చాళుక్యులు బాదామి చాళుక్యులుగా ప్రసిద్ధి చెందారు. ఆ బాదామి చాళుక్యుల ఆలయ కట్టడాలను పోలిన రూపులమ్మ ఆలయం మాచర్లలో శిథిలావస్థలో ఉంది.



మట్టిలో పూడుకు పోయిన ముఖద్వారం

మహాదేవమ్మ చెరువులో కొలువై..

అందరూ చూస్తూ ఎవరూ పట్టించుకోని ఈ శిథిలాలయం మాచర్లకు ఐదారు కిలో మీటర్ల దూరంలో ని దుర్గి మండలం తేరాల సమీపంలో మహాదేవమ్మ చెరువు ఉంది. ప్రస్తుతం దీన్ని బ్రహ్మనాయుడు చెరువుగా పిలుస్తారు. తేరాలలోని సిద్ధేశ్వరస్వామి ఆలయాన్ని గతంలో ఏపీ హెరిటేజ్ అండ్ కల్చరల్ టూరిజంలో పరిశోధనలు చేస్తున్న రుచీసింగ్ సందర్శించారు. పక్కనే ఉన్న పాడుబడ్డ రూపులమ్మ ఆలయాన్ని ఆమె ఆసక్తిగా పరిశీలించి ఎన్నో శతాబ్దాల క్రితం నాటిదిగా గుర్తించారు. ఈ మేరకు భారత పురావస్తు శాఖకు ఈ సమాచారం అందించారు. ఆలయం రూపురేఖలు, దానిపై చెక్కిన నగిషీలు, శిల్పాలు, గోపురం తీరు వంటివన్నీ పరిశీలించి 7వ శతాబ్దంలో బాదామి చాళుక్యులు నిర్మించిన అతిపురాతన కట్టడంగా తమ రికార్డులకు ఎక్కించారు.



ఆలయం గోడలపై కళాకృతులు

ఏసీబీ వలలో వీఆర్వో

- రూ. 2 లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం



లంచం తీసుకుంటూ పట్టుబడిన వీఆర్వో హసీనా

గుంటూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చనిపోయిన భర్త పేరుతో ఉన్న పొలాన్ని ఆన్‌లైన్‌లో భార్య పేరుమీద మార్చడానికి(మ్యుటే షన్ కోసం) రూ.2లక్షలు లంచం తీసుకుంటూ గుంటూరు రూరల్ మండలం అంకిరెడ్డిపాలెం వీఆర్వో షేక్ హసీనా అవినీతి నిరోధకశాఖ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఏసీబీ అదనపు ఎస్పీ మత్తె మహేంద్ర కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు రూరల్ మండలం వెంగళయపాలెం గ్రామానికి చెందిన ఎక్స్‌ఆర్మీ చెరుకూరి సత్యనారాయణ గత ఏడాది డిసెంబర్‌లో మృతి చెందారు. ఆయన పేరుతో గ్రామంలో ఎకరం 25 సెంట్లు వ్యవసాయ భూమి ఉంది. దానిని తన పేరు మీదకు మార్చుకునేందుకు (మ్యుటేషన్) కోసం సత్యనారాయణ భార్య ప్రమీల సచివాలయంలో దరఖాస్తు చేసుకునేందుకు గత నెల 28న వెళ్ళారు. అంకిరెడ్డిపాలెం వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న హసీనా వెంగళాయపాలెం గ్రామానికి గత అక్టోబరు 4 నుంచి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ప్రమీల దరఖాస్తు చేసుకున్న రోజునే హసీనా రూ. 2.5 లక్షలు డిమాండ్ చేసింది. అయితే తాను అంత ఇచ్చుకోలేనని ప్రమీల చెప్పడంతో చివరకు రెండు లక్షల 20 వేల రూపాయలకు బేరం కుదుర్చుకుంది. దీనిలో భాగంగా అదే రోజున ప్రమీల నుంచి పదివేలు తీసుకుంది. ఈ నెల 2న ప్రమీల సచివాలయంలో దరఖాస్తు చేసుకోగా రెండు లక్షలు ఇస్తేనే పని పూర్తి చేస్తానని హసీనా స్పష్టం చేసింది. లంచం ఇవ్వడం ఇష్టం లేని బాధితురాలు ప్రమీల ఏసీబీ అధికారులను సంప్రదించింది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి వెంగళాయపాలెంలోని సచివాలయంలో ప్రమీల నుంచి వీఆర్వో రూ. రెండు లక్షలు నగదు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని నగదు స్వాధీనం చేసుకున్నారు. కాగా హసీనా గతంలో మంగళగిరి ప్రాంతంలో పనిచేసిన సమయంలో కూడా ఆమెపై పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు వచ్చాయి. అక్కడ రూ. ఐదు కోట్ల భూ వివాదంలో కూడా ఆమె పాత్ర ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఆమె గతంలో పని చేసిన ప్రతి చోటా ఇదే తరహాలో ముక్కు పిండి లంచం వసూలు చేసేదని ఆరోపణలు ఉన్నాయి.

నర్సింగ్ విద్యార్థిని మృతి కేసులో

వీడిన మిస్టరీ

- లైంగిక సంబంధానికి ఒప్పుకోక పోవడంతో భవనంపై నుంచి తోసేసి చంపిన మహిళ

గుంటూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : హాస్టల్‌పై నుంచి కిందపడి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన పంపాల సువర్ణ (23)అనే నర్సింగ్ విద్యార్థిని కేసులో మిస్టరీ వీడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోతురాజు వెంకట్ అనే వ్యక్తి నెహ్రూనగర్ రైల్వేస్టేషన్ సమీపంలో వృద్ధుల ఆశ్రయం, సధార్ హోం నడుపుతున్నాడు. రెండు నెలల కిందట పంపాలా సువర్ణ(22) అనే నర్సింగ్ చదివే విదార్థిని సధార్ హోమ్‌లో చేరింది. సువర్ణను అదే హాస్టల్‌లో వుంటున్న విజయలక్ష్మి (48) అనే మహిళ లైంగిక సంబంధం కోసం ఒత్తిడి చేసింది. అందుకు సువర్ణ ఒప్పుకోక పోవడంతో ఆమెతో గొడవపడింది. సువర్ణ బాత్‌రూమ్‌కు వెళ్ళిన సమయంలో విజయలక్ష్మి కూడా వెళ్ళింది. అక్కడ కూడా విజయలక్ష్మి ఒత్తిడి చేయగా ఆమె తిరస్కరించింది. దీంతో అక్కడ జరిగిన తోపులాటలో సువర్ణను విజయలక్ష్మి కిందకు నెట్టేసింది. దీంతో ఆమె తీవ్రంగా గాయపడి జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి తల్లిదండ్రులు లేకపోవడంతో చిన్నప్పటి నుంచి హాస్టల్స్‌లో ఉంటూ చదువుకుంటోంది.



నిరక్షరాస్యులకు అక్షరజ్ఞానం

ఉల్లాస్

పొదుపు సంఘాల మహిళలు ఆర్థిక సాధికారిత సాధించేలా కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఇదంతా బాగానే ఉన్నప్పటికీ, ప్రతీ సంఘంలోనూ దాదాపు ఇద్దరు లేదా ముగ్గురికి పైగా సభ్యులు నిరక్షరాస్యులుగా ఉంటున్నారు. ప్రస్తుతం వారందరినీ గుర్తించే పనిలో డీఆర్‌డీఏ అధికారులు, సిబ్బంది ఉన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వీరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, వయోజన విద్యా విభాగం కలిసి 'ఉల్లాస్' కార్యక్రమం అమలు చేసేలా కార్యాచరణ రూపొందించింది.

- డిజిటల్ లావాదేవీలపై పొదుపు సంఘాల మహిళలకు అవగాహన
- సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యం
- కాలానుగుణంగా మారేలా శిక్షణ
- సాయంత్రపు బడులు



సత్తెనపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) :చదువులేని మహిళల్లో అక్షరాస్యతపై చైతన్యం పెంపొందేలా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉల్లాస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందు కోసం లాభాపేక్ష లేకుండా స్వచ్ఛందంగా చదువు చెప్పటానికి ముందుకు వచ్చే మహిళలు, యువతులను వాలంటీర్లుగా ఏర్పాటు చేసి వారి ద్వారా నిరక్షరాస్యులను సాధారణ డిజిటల్ అక్షరాస్యులుగా తీర్చిదిద్దనున్నారు. జాతీయ విద్యా విధానం-2020 పాలసీకి అనుగుణంగా దీనిని అమలుచేస్తున్నారు. ఇందులో భాగంగా ఐదు విభాగాల్లో తర్ఫీదు ఉంటుంది.

ప్రతి గ్రామం నుంచి 10 నుంచి 20 మంది మహిళలకు చదువు నేర్పిస్తారు. అక్షరాలు నేర్చుకోవడం, సంతకాలు చేయటంతో పాటు బ్యాంక్ లావాదేవీల నిర్వాహణ తదితర వాటి పై అవగాహన కల్పిస్తారు. ప్రధానంగా ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేయటం, మొబైల్ బ్యాంకింగ్ తదితర డిజిటల్ అక్షరాస్యతపై తర్ఫీదు ఇస్తారు. తద్వారా వీరు మరొకరిపై ఆధారపడకుండా తమ సొంతంగా బ్యాంకుకు వెళ్ళి గాని, ఇంటి నుంచి గాని తమ ఖాతాకు, సంఘానికి సంబంధించిన పనులు చక్కబెట్టేలా శిక్షణ పొందనున్నారు. 'ఉల్లాస్' అమలు బాధ్యతను ప్రభుత్వం టీసీఎస్ సంస్థకు అప్పగించింది. శిక్షణ పొందే మహిళలకు సులువుగా అర్థమయ్యే రీతిలో ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను సంస్థ అభివృద్ధి చేసింది. ఇందులో సమాచారం, బోధన, అభ్యాసన వీడియోలు తెలుగులోనే ఉంటాయి. శిక్షణ పొందిన వాలంటీర్ల ద్వారా మహిళలకు బోధించనున్నారు. గ్రామాల్లో ఉండే అంగన్‌వాడీ కేంద్రాలు, సామాజిక భవనాలను అక్షరాస్యకేంద్రాలుగా నిర్వహించనున్నారు. గతంలో అమలు చేసిన 'సాక్షర భారత్' తరహాలోనే సాయంత్రం బడులు ఉంటాయి. ప్రతి పది మందికి ఒక వాలంటీరు బోధిస్తారు. ఆరు నెలల పాటు జరిగే శిక్షణ ద్వారా ప్రగతి సాధించిన వారికి ధృవపత్రాలు ఇస్తారు. అదే విధంగా సార్వత్రిక విద్యా పాటం ద్వారా ఉన్నత తరగతులు చదివే వీలు కల్పిస్తారు. పల్నాడు జిల్లాలో 36,623 పొదుపు సంఘాలు ఉండగా, అందులో 3,71,023 మంది సభ్యులు ఉన్నారు. ఇందులో నిరక్ష్యరాస్యులు 10,700 మంది ఉన్నారు.

నిరక్షరాస్యులు, వలంటీర్లు గుర్తింపు

\- పీడీ బాలూ నాయక్, డీఆర్‌డీఏ పల్నాడు జిల్లా



నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దటానికి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థతో పాటు వయోజన విద్యా విభాగం సమన్వయంతో పని చేస్తున్నాయి. పల్నాడు జిల్లాలో పది వేల మందికి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించాం. ప్రస్తుతం నిరక్ష్యరాస్యులతో పాటు వాలంటీర్లను గుర్తించాం. తొలి దశలో శిక్షణ పొందుతారు. ఎవరైనా మిగిలి పోతే వారికి మలి దశలో శిక్షణ ఉంటుంది.



ఎమ్మెల్సీ ఓటుహక్కు నమోదుకు 1612 దరఖాస్తులు

● నేటితో ముగియనున్న గడువు

దుగ్గిరాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు హక్కుకై మండలంలో మొత్తం 1612 దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ సునీత మంగళవారం తెలిపారు. పట్టభద్రుల ఓటుహక్కు నమోదుకై బుధవారంతో గడువు ముగియనుంది. సకాలంలో దరఖాస్తులను అందించే వారు, ఫారం-18 పూర్తి చేసి, డిగ్రీ ఓడీ లేదా ప్రొవిజన్, ఓటర్లు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను, పాస్ పోర్ట్ ఫొటోను జత చేసి, గెజిటెడ్ అధికారి సంతకాలతో, సాయంత్రం 5 గంటలలోపు తహసీల్దార్ కార్యాలయంలో అందించవచ్చునని తెలిపారు.

●కాకుమాను, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ వెంకటస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

● తాడికొండ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇప్పటి వరకు 1711 మంది గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారని తహసీల్దార్ నాసరయ్య తెలిపారు.

వీఐటీలో రేపు ఐహెచ్ఈఎఫ్

● ముఖ్యఅతిథిగా మంత్రి నారా లోకేశ్

తుళ్లూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని ఐనవోలులో గల వీఐటీలో ఈ నెల 7న ఉదయం ఇంటర్నేషనల్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఫెయిర్(ఐహెచ్ఈఎఫ్) కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మంగళవారం ఒక ప్రకటనలో వీఐటీ యాజమాన్యం పేర్కొనింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, గౌరవఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ హాజరవుతారని తెలిపింది. అలాగే 8న వికాస్ (వీఐటీ - ఏపీ ఇన్నోవేషన నాలెడ్జ్ అక్విజిషన్) నిర్వహించనున్నట్టు యాజమాన్యం తెలిపింది.

పొదుపు అభివృద్ధికి మలుపు

ఫిరంగిపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పొదుపు ద్వారానే అభివృద్ధి సాధ్యమని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు వేములూరి పాడు శాఖ మేనేజర్ బీ శాంతకుమారి అన్నారు. మంగళవారం మండలంలోని అమీనాబాద్ పంచాయతీ కార్యాలయం వద్ద భారతీయ రిజర్వు బ్యాంకు సౌజన్యంతో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో ఖాతాదారుల అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. బ్యాంకింగ్ రంగంలో అనేక ఆర్థిక అవకాశాలు ఉన్నాయని, వాటిని ఖాతాదారులు సద్వినియోగించుకొని కలలను సాకారం చేసుకోవాలన్నారు. సభకు ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్ పాల్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో డ్వాక్రా సీసీ నాగరాజు, నల్లపాడు మాజీ సర్పంచ్ విజయ భాస్కర్, రిసోర్స్ పర్సన్ వెంకటేశ్వరరావు, బాజీ, పార్వతి, రైతులు పాల్గొన్నారు.

టెక్నాలజీని రైతులు అందిపుచ్చుకోవాలి

● ఉద్యాన శాఖ రాష్ట్ర డైరెక్టర్ శ్రీనివాసులు

గుంటూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన సాగులో వస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని ఆ శాఖ రాష్ట్ర డైరెక్టర్, సీనియర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ కే శ్రీనివాసులు సూచించారు. మంగళవారం వట్టిచెరుకూరు మండలంలోని పుల్లడిగుంట రైతు నేస్తం ఫౌండేషన్‌లో బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డిజిటల్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా ఈమిర్చా 2.0 ప్రాజెక్టు ఇన్‌పుట్, బయ్యర్ సెల్లర్ మీట్ జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డైరెక్టర్ శ్రీనివాసులు అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ని సందర్శించారు. డ్రోన్స్ వినియోగాన్ని అడిగి తెలుసుకొన్నారు. కార్యక్రమంలో డిజిటల్ గ్రీన్ ప్రొడక్టు మేనేజ్‌మెంట్ సీనియర్ డైరెక్టర్ గౌతం మండేవాకర్, ఏపీ రీజనల్ హెడ్ నరేంద్ర, ఏడీ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

పెదనందిపాడు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉదయం మండలపరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీవో లక్ష్మీదేవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

నిర్దిష్ట లక్ష్యాలను అధికారులు అధిగమించాలి

● పేరేచర్ల హౌసింగ్ స్కీంపై కమిషనర్ శ్రీనివాసులు సమీక్ష

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ హౌసింగ్ లే అవుట్స్‌లో ఇళ్ల నిర్మాణ పనుల కాంట్రాక్టు పొందిన కాంట్రాక్టర్లు పనులు వేగవంతం చేసి, డిసెంబర్ నెలలో తమ నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేసేలా హౌసింగ్, నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు ప్రతి రోజు పర్యవేక్షించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం గుంటూరు నగరపాలక సంస్థ లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించిన పేరేచర్ల లే అవుట్‌లో హౌసింగ్ పీడీ, ఇంజనీరింగ్, హౌసింగ్ డిపార్టుమెంట్



సమీక్షలో ప్రసంగిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

అధికారులు, ఎమినిటి కార్యదర్శులు, కాంట్రాక్టర్లతో లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డిసెంబరు నెలలో లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేసేలా హౌసింగ్ లే అవుట్స్‌లో ఇళ్ల నిర్మాణ పనులు కాంట్రాక్టర్ల వారీగా ఇచ్చిన టైం లైన్ మేరకు చేపట్టాలని, నిర్మాణ పనుల కాంట్రాక్ట్ పొందిన వారు అవసరమైన కార్మికులను సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రతి లే అవుట్ నుంచి కాంట్రాక్టర్ ప్రతి రోజు నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా పనులు చేయాలని, నోడల్ అధికారులు కూడా పర్యవేక్షణ చేయాలన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ ప్రసాద్, ఈఈ శంకరరావు, నగరపాలక సంస్థ ఈఈ సుందర్రామిరెడ్డి, నగరపాలక సంస్థ, హౌసింగ్ డీఈఈలు, ఏఈలు, నోడల్ అధికారులు, మైనింగ్ అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి వేడుకలు



దుగ్గిరాల రైలుపేటలోని నాగేంద్రస్వామి పుట్టలో పాలు పోస్తున్న మహిళలు

దుగ్గిరాల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లో నాగులచవితి వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. దుగ్గిరాలలోని శివాలయంలోనూ, రైలుపేట నాగేంద్రస్వామివారి ఆలయంలోనూ, యాదవపాలెంలోని నాంగేంద్రస్వామి పుట్టలోనూ పలువురు మహిళలు ఆవుపాలు పోసి, అరటి పండ్లు, కోడిగుడ్లు పుట్టపై ఉంచి తమ భక్తిని చాటుకున్నారు. ఈమని-చింతలపూడి గ్రామాల శివారులో ఉన్న భానుమతివారి తోటలో ఉన్న నాగేంద్రస్వామి పుట్టలో మహిళలు పాలు పోశారు.

తాడేపల్లి టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పరిధిలో నాగుల చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శ్రీసోమేశ్వర స్వామి ఆలయంలో ఉన్న పుట్టలో పాలు పోశారు. శ్రీపార్వతి సమేత సోమేశ్వరస్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

పెదనందిపాడు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో నాగుల చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు తెల్లవారుజామున పుట్టలో పాలు పోసి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

ఏసీసీ సిమెంటు ఫ్యాక్టరీ కార్మికుల రాస్తారోకో

తాడేపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఏసీసీ సిమెంటు ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను సీఎం చంద్రబాబు జోక్యం చేసుకుని పరిష్కరించాలని కార్మికుల న్యాయమైన సమస్యలు తీర్చాలని డిమాండ్ చేస్తూ ఏసీసీ కార్మికులు అఖిలపక్ష ట్రేడ్ యూనియన్ ప్రతినిధులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికుల పక్షాన ఉంటుందో, యాజమాన్యం పక్షాన ఉంటుందో తేల్చుకోవాలని అన్నారు. 33 ఏళ్ల క్రితం అక్రమ లాకౌట్ ప్రకటించిన ఏసీసీ యాజమాన్యం అప్పటికే నెల రోజులు పని చేసిన కార్మికులకు జీతం కూడా ఇవ్వలేదన్నారు. సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటం చేస్తామన్నారు. ట్రేడ్ యూనియన్ నేతలు పాశం రామారావు, దొంతిరెడ్డి వేమారెడ్డి, దర్శనపు శామ్యూల్, ఏఐటీయూసీ, వైసీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు



ధర్నా నిర్వహిస్తున్న ఏసీసీ కంపెనీ కార్మికులు, ప్రజాసంఘాల నేతలు

రోడ్డు పనులను పరిశీలించిన ఆర్అండ్‌బీ అధికారులు

దుగ్గిరాల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలో కొత్తగా నిర్మిస్తున్న బీటీ రోడ్డు నిర్మాణం పనులను రోడ్లు, భవనాలశాఖ నాణ్యత నిర్ధారణ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. గడచిన ఐదేళ్లలో రోడ్డు మరమ్మతు చేపట్టక పోవడంతో ప్రజలు నానా అవస్థలు పడిన విషయం విదితమే. మంత్రి లోకేశ్ ఎన్నికల హామీలో భాగంగా తొలి ప్రాధాన్యంగా మెయిన్‌రోడ్డు నిర్మాణం పనులు నెలరోజుల క్రితం ప్రారంభించారు. భారీగా ఏర్పడిన గుంతలను పూడ్చడంతోపాటు, గతంలో కంటె సుమారు అడుగు మేర రోడ్డుఎత్తును పెంచారు. మొత్తం 1.7కి.మీ మేర రోడ్డును రూ.కోటితో నిర్మాణం ప్రారంభించారు. వాహనదారులు వారం రోజులుగా చిప్స్‌డస్ట్ కలిపి వేసినరోడ్డు నుంచి భారీగా దుమ్ము వస్తుండటంతో రోడ్డుపై నడిచి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్అండ్‌బీ శాఖ నాణ్యతా నిర్ధారణ ఈఈ శ్రీనివాసరావు, ఆర్అండ్‌బీ డీఈ రాజేంద్రనాయుడు, జేఈ నరసింహారావు తదితరులు రోడ్డు నాణ్యతను పరిశీలించారు. పనుల్లో జాప్యంపై అధికారులతో మాట్లాడగా, కాంట్రాక్టర్‌తో మాట్లాడి వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు.

కానిస్టేబుల్‌పై చేయి చేసుకున్న తోటి కానిస్టేబుల్

గుంటూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తుళ్లూరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఓ కానిస్టేబుల్ తోటి కానిస్టేబుల్‌పై చేయి చేసుకున్నట్లు తెలుస్తోంది. ట్రాఫిక్‌లో విధులు నిర్వహిస్తున్న కత్తి శ్రీను అనే కానిస్టేబుల్ విధులకు సరిగా హాజరు కావడంలేదు. మంగళవారం కూడా ఆయన విధులకు రాలేదు. అదే స్థానంలో విధులు నిర్వహించేందుకు వచ్చిన సుబ్బారావు అనే కానిస్టేబుల్ ఈ విషయాన్ని పైఅధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పాడు. దీంతో పోలీస్‌స్టేషన్ వద్ద కత్తి శ్రీను మరో కానిస్టేబుల్ సుబ్బారావుపై చేయి చేసుకున్నారు. అయితే పోలీసులు దీనిని గోప్యంగా ఉంచుతున్నట్లు తెలుస్తోంది.

ఎన్నికల హామీని నెరవేర్చిన నారా బ్రాహ్మణి

● కూరగాయల వ్యాపారులకు స్థలం కేటాయింపు



కాళీమాత ఆలయం సమీపంలో ఏర్పాటైన కూరగాయల దుకాణాలు

మంగళగిరి సిటీ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను మంత్రి నారా లోకేశ్ వడివడిగా అమలు చేస్తున్నారు. ఆయనతోపాటు ఎన్నికల ప్రచార సమయంలో మంత్రి లోకేశ్ సతీమణి నారా బ్రాహ్మణి చిరువ్యాపారులకు ఇచ్చిన హామీని తాజాగా నెరవేర్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళగిరి ఎర్రచెరువు కాళీమాత ఆలయం వద్ద రోడ్డుపై కూరగాయలు అమ్ముకుంటున్న చిరువ్యాపారులతో బ్రాహ్మణి భేటీ అయ్యి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఇచ్చిన మాట ప్రకారం కూరగాయల విక్రేతలకు స్థలం కేటాయించేందుకు చొరవ చూపారు. కాళీమాత ఆలయం సమీపంలోనే ఎంటీఎంసీ అధికారులు స్థలాన్ని కేటాయించి చదును చేసి చిరువ్యాపారులు వ్యాపారం చేసుకునేందుకు వీలుగా తీర్చిదిద్దారు. తమ సమస్యను పరిష్కరించిన బ్రాహ్మణికి స్థానిక కూరగాయల వ్యాపారులు కృతజ్ఞతలు తెలియజేశారు.

నైపుణ్య గణనను సమర్థవంతంగా నిర్వహించాలి

● రూరల్ మండల ఎంపీడీవో బండి శ్రీనివాసరావు

గుంటూరు(తూర్పు), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నైపుణ్య గణనను మండలంలో సమర్థవంతంగా నిర్వహించాలని గుంటూరు రూరల్ మండల ఎంపీడీవో బండి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక కలెక్టర్ బంగ్లా రోడ్డులోని మండల పరిషత్ కార్యాలయంలో నైపుణ్య గణన సర్వే కార్యక్రమంపై సచివాలయ సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15-59 మధ్య వయస్సు కల్గిన వారికి నైపుణ్య గణన సర్వే నిర్వహించడంతో పాటు ఇతర వివరాలను సేకరించాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ కే శ్రీనివాసరావు, అసిస్టెంట్ గణాంక అధికారి ఎన్ఎస్ శర్మ, మండల కో ఆర్డినేటర్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్‌కు నూతక్కి విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం రాజీవ్‌రత్న, పీడీ రజనీనాయక్

మంగళగిరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం నూతక్కి జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయుడు కే రజనీ నాయక్ తెలిపారు. ఇటీవల జరిగిన అండర్-14 జిల్లా స్థాయి పోటీల్లో నూతక్కి అనూహ్య, చోడవరపు నందుషా, నూతక్కి నందు, రావూరి కోటిసూర్య, బోరుగడ్డ జగన్‌లు అద్భుతంగా రాణించి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారన్నారు. విజయనగరం జిల్లా బోగాపురంలో ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు జరుగనున్న రాష్ట్ర స్థాయి చాంపియన్ షిప్‌లో వీరు పాల్గొంటారని చెప్పారు. ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు బి.రాజీవ్‌రత్న, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

స్కిల్ సర్వేను సమగ్రంగా నిర్వహించాలి : ఎంపీడీవో

తాడికొండ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్కిల్ సర్వేను సమగ్రంగా నిర్వహించాలని ఎంపీడీవో సమతావాణి తెలిపారు. మంళగవారం తాడికొండ మండల పరిషత్ కార్యాలయంలో నైపుణ్య గణన సర్వే శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రస్తుతం స్కిల్ సర్వే రాజధాని 29 గ్రామాల్లో జరుగుతుందని ఈనెల 9వ తేదీ వరకు సర్వే జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నైపుణ్య గణన సర్వే చేయటానికి సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇస్తారన్నారు. గ్రామాల్లోని ప్రతి ఇంట్లో ఉన్న నిరుద్యోగులను గుర్తించి వారి విద్యార్హతలు తెలుసుకొని తద్వారా వారికి ఉపాధి అవకాశాలు కల్పించేలా సీఎం చంద్రబాబు నాయుడు స్కిల్ సర్వేకు శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో ఏపీవో సాంబశివ రావు, ఏఎస్‌వో, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బీఎల్‌వోలు అర్హులైన ఓటర్లను చేర్చుకోవాలి

ఫిరంగిపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): బూత్ లెవల్ అధికారులు అర్హులైన ఓటర్లను చేర్చుకోవాలని తహసీల్దార్ జే ప్రసాదరావు అన్నారు. మంగళవారం ఫిరంగిపురంలోని మండల రెవెన్యూ కార్యాలయంలో జరిగిన బీఎల్‌వోల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనరల్ ఎలక్షన్‌కు ఈ ఏడాది అక్టోబరు 29వ తేదీ నుంచి నవంబరు నెల 28వ తేదీ వరకు క్లైమ్‌లు, తప్పొప్పులు, చేర్పులు, మార్పులు, తీసివేతలు జరుగుతున్నాయన్నారు. అలాగే నవంబరు 9, 10, 23, 24 తేదీల్లో మండలంలో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామని, ఆ శిబిరాల్లో ఓటర్ల జాబితాలు తయారు చేయటానికి నూతన ఓటర్లను నమోదు చేసుకుంటారని, దీనికై 6, 7, 8, 8ఏ దరఖాస్తులను అర్హులైన వారు సద్వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రెహ్మాన్, ఏఎస్‌వో తదితర రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఉల్లాస్ ప్రయోజనాలను వయోజనులకు అందించాలి

● ఎంపీడీవో తోట చందన

మేడికొండూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యావిధానం సిఫార్సులకు అనుగుణంగా ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఆఫ్ సొసైటీ) ద్వారా అందే ప్రయోజనాలను వయోజనులకు అందించాలని ఎంపీడీవో తోట చందన తెలిపారు. ఉల్లాస్ కార్యక్రమంపై ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులకు, వీవోఏలకు మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఈ పథకం 15 ఏళ్లు అంతకంటే ఎక్కువ వయస్సు గల నిరక్షరాస్యులను లక్ష్యంగా చేసుకొని ప్రభుత్వం రూపొందించినట్టు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరు సాయంత్రం 5 నుంచి రాత్రి 8గంటల వరకు సుమారు 6 నెలల పాటు నిరక్షరాస్యులైన వయోజన మహిళలకు ఉల్లాస్ కార్యక్రమంపై శిక్షణ ఇవ్వాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో వయోజన విద్య సూపర్‌వైజర్ చలపతిరావు, ఏపీఎం విజయభారతి, ఎంఈవో అలీం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమలత, కృష్ణకుమారి, సీసీ మేరీ తదితరులతో పాటు వీఓఏలు పాల్గొన్నారు.

● ఫిరంగిపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఏపీఎం బీ నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం ఫిరంగిపురంలోని మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఉల్లాస్‌పై శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండలంలోని డ్వాక్రా సభ్యులకు, వయోజనులకు అంగన్‌వాడీలో పని చేస్తున్న వారికి అక్షరాస్యత కార్యక్రమాలను అమలు జరపాల్సిన అవసరం ఉందన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత

తాడేపల్లి టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన నగదును పట్టణ కార్యాలయంలో 16వ వార్డుకు చెందిన గోలి సోహన్‌శివేష్‌కు మంగళవారం రూ.90881లు చెక్కును టీడీపీ పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు అందజేశారు. లబ్ధిదారులు చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి దారా దాసు, తెలుగుయువత పట్టణ అధ్యక్షుడు నాగేశ్వరరావు, నవీన్‌రాజా, శివ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల రక్షణలో తప్పిపోయిన చిన్నారులు

మంగళగిరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం కాజ గ్రామపరిధిలోని టోల్ ప్లాజా వద్ద ఇద్దరు చిన్నారులు సంచరిస్తుండగా రూరల్ పోలీసులు గమనించి సంరక్షణలోకి తీసుకున్నారు. మంగళగిరి రూరల్ పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ చిన్నారులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. తమ పేర్లు షేక్ అస్లాం, హాసియా అని, తల్లిదండ్రుల పేర్లు షేక్ సలీమ్, జయ అని చెబుతున్నారని ఎస్ఐ వెంకట్ తెలిపారు. తమది విజయవాడ, గుంటూరు అంటూ స్పష్టత లేని సమాధానాలు చెబుతున్నారని, పిల్లల ఆచూకీ తెలిసిన వారు మంగళగిరి రూరల్ పోలీసుస్టేషన్‌లో కానీ, సెల్: 8688831363 నెంబరులో కానీ సంప్రదించాలని కోరారు.



పిల్లల వివరాలు తెలుసుకుంటున్న ఎస్ఐ వెంకట్

కక్ష సాధింపు చర్యలు ఆపాలి

మంగళగిరి సిటీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులపై కక్ష సాధింపు చర్యలను ఆపాలని సీఐటీయూ నేత ఎస్ఎస్ చెంగయ్య కోరారు. మంగళగిరి సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం పారిశుధ్య కార్మికుల విస్తృత సమావేశం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షురాలు వెంగమ్మ అధ్యక్షతన జరిగింది. చెంగయ్య మాట్లాడుతూ విధుల నుంచి కక్షపూరితంగా తొలగించిన కార్మికులను వెంటనే పనిలోకి తీసుకోవాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ రాజధాని డివిజన్ అధ్యక్షుడు ఎం రవి, వెంకటరెడ్డి, పార్వతి, కామాక్షి, కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మార్చి చివరికి గృహ నిర్మాణాలు పూర్తి కావాలి

● హౌసింగ్ పీడీ ప్రసాద్

ప్రత్తిపాడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): హౌసింగ్ లే అవుట్స్‌లలో వివిధ దశల్లో ఉన్న గృహాలు మార్చి చివరికి పూర్తి కావాలని హౌసింగ్ పీడీ ప్రసాద్ తెలిపారు. ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం ఏర్పాటు చేసి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మార్చి లోపు పూర్తి చేసుకున్న గృహాలకు మాత్రమే బిల్లులు ఇస్తారన్నారు. ఆ తరువాత పూర్తి చేస్తే ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా ఇవ్వడం జరగదన్నారు. వివిధ దశల్లో ఉన్న లబ్ధిదారులు వెంటనే తమ గృహాలను పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. తరువాత వచ్చే స్కీమ్‌లో ఈ లబ్ధిదారులకు గృహాలు మంజూరు చేయడం కుదరదన్నారు. ఈ విషయాన్ని లబ్ధిదారులు గమనించి త్వరగా పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. అంతే కాకుండా లే అవుట్స్‌లోని ప్లాట్లు అమ్మకాలు కొనుగోల్లు వంటివి జరిగినా అవి చెల్లవన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తాడేపల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం ఎంటీఎంసీ పరిధి లోని గుండిమెడ ఇసుక రీచ్ నుంచి మంగళవారం తెల్లవారుజామున ఇసుక అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను తాడేపల్లి పోలీసులు పట్టుకున్నారు. ఇసుక రీచ్ నుంచి ట్రాక్టర్లను తరలిస్తుండగా కరకట్ట వద్ద మార్గంమధ్యలో ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఉచిత ఇసుక పథకాన్ని ప్రారంభించగా కొందరు అక్రమార్కులు అడ్డదారిలో ఇసుకను తరలిస్తూ ప్రభుత్వ ఆశయానికి గండికొడుతున్నారు. మూడు ట్రాక్టర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా ఏం జరిగిందో.. ఏమిటో.. తెలియదు కానీ, పట్టుకున్న ట్రాక్టర్లను వదిలివేసినట్టు సమాచారం. ఈ విషయమై పోలీసులను, అధికారులను వివరణ అడగ్గా ప్రతి ఒక్కరూ తమకు తెలియదంటూ, ఎఫ్ఐఆర్ కాలేదంటూ సమాధానం ఇస్తున్నారు. ఇసుక తరలింపును అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన

మంగళగిరి సిటీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి ఎన్టీఆర్ నగర్ టిడ్కో సముదాయంలో నిర్వహిస్తున్న టీడీపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభిస్తోంది. సభ్యత్వాలను స్వీకరించేందుకు టిడ్కో వాసులు ఆసక్తిని కనబరుస్తుండడంతో మంగళవారం రాత్రి వరకు సభ్యత్వ నమోదు కొనసాగింది.

నేటితో ముగియనున్న ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియ

తెనాలి రూరల్, పొన్నూరు టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఓట్ల నమోదు ప్రక్రియ బుధవారంతో ముగియనున్నదని తెనాలి, పొన్నూరు తహసీల్దార్లు గోపాలకృష్ణ, జియావుల్ హక్‌లు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. డిగ్రీ ఉత్తీర్ణులైన ప్రతి ఒక్కరూ సంబంధిత పత్రాలతో ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో ఓటర్లుగా నమోదు చేసుకోవాలని కోరారు.

క్రైమ్ జోన్

విడాకులు కావాలంటూ భార్యపై దాడి

తెనాలి, మారీసుపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విడాకులు కావాలంటూ భర్త భార్యపై దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక మారీసుపేటకు చెందిన షేక్ బాబుబాషాకి ఖాజాబీతో సుమారు 10 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. బాబుబాషా తాపీమేస్త్రీగా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మరో మహిళతో సహజీవనం చేస్తున్నాడు. తరచూ భార్య నుంచి విడాకులు కావాలంటూ భార్యతో గొడవ పడుతున్నాడు. విడాకులివ్వాలంటూ సోమవారం ఆమెపై దాడికి పాల్పడ్డాడు. గాయాలతో ఉన్న ఖాజాబీని కుటుంబ సభ్యులు తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. మంగవారం ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు

పెదకాకాని, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదుచేసిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు మంగళవారం పెదకాకాని పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని వెనిగండ్ల గ్రామానికి చెందిన సుబ్బారావు, అతని భార్య వెంకటరమణ మరో ముగ్గురు పిల్లలు కలిసి జీవిస్తున్నారు. గత నెల 21 తారీఖున రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయింది. బంధువులు వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీంతో పెదకాకాని పోలీసులకు ఫిర్యాదు చేయగా మహిళా దృశ్యంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సులు

పొన్నూరు టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీక మాసం సందర్భంగా శైవక్షేత్రాలు, పంచారామాలకు ప్రత్యేక బస్సులు నిర్వహిస్తునట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ టి.అజితకుమారి మంగళవారం తెలిపారు. రాష్ట్రంలోని పంచారామాలైన సామర్ల కోట, ద్రాక్షారామం, పాలకొల్లు, భీమవరం, అమరావతిలకు ఒకే రోజులో దర్శనాలు పూర్తిఅయేలా ఈ బస్సు సర్వీసును నిర్వహిస్తునట్లు చెప్పారు. ప్రతి శని, ఆదివారాలు రాత్రివేళ 8, 9 గంటలకు ఈ బస్సులు బయల్దేరి పుణ్యక్షేత్రాల దర్శనం తర్వాత మరుసటి రోజు రాత్రి బస్సులు పొన్నూరు చేరుతాయన్నారు. అలాగే శ్రీశైవ క్షేత్రాలైన యాగంటి, మహానంది, శ్రీశైలం క్షేత్రాలకు ఎక్స్‌ప్రెస్, అల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు.


సత్కారాల పేరుతో నిధులు వసూళ్లు చేస్తే చర్యలు

పొన్నూరు టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సన్మానాలు, సత్కారాల పేరుతో ఏ ప్రభుత్వ శాఖలోనైనా చందాలు వసూళ్లు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలుగుదేశం పార్టీ కార్యాలయం ప్రతినిధులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సన్మానాలు నిర్వహిస్తున్నామని కార్యక్రమాలు జరుపుతున్నామని ఏ ప్రభుత్వ శాఖ అధికారి అయినా, ప్రైవేటు వ్యక్తి అయినా డబ్బుల వసూళ్లకు పాల్పడితే టీడీపీ కార్యాలయలో తెలియజేయాల్సిందిగా కోరారు.

10న మెగా కంటి వైద్య శిబిరం

తెనాలి, మారీసుపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 10వ తేదీన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీవాసవీ సేవా సమితి, పట్టణ ఆర్యవైశ్య సంఘ సభ్యులు తెలిపారు. స్థానిక కన్యకాపరమేశ్వరి వైశ్యవిద్యానిధి హాస్టల్ ఆవరణలో మంగళవారం శ్రీవాసవీ సేవా సమితి, పట్టణ ఆర్య వైశ్య సంఘం సభ్యులు, తెనాలి కన్యకాపరమేశ్వరి వైశ్య విద్యానిధి కమిటీ కార్యదర్శి పెండేల సుబ్బారావు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని కన్యకాపరమేశ్వరి వైశ్యవిద్యానిధి హాస్టల్ ఆవరణలో నిర్వహిస్తామని తెలిపారు.

హైకోర్టు ఏజీపీగా ఆనందరావు



ఆనందరావు

పొన్నూరు టౌన్, నవంబరు 5: మండల పరిధిలోని ఉప్పరపాలెం గ్రామానికి చెందిన తాడిశెట్టి వెంకట ఆనందరావు రాష్ట్ర హైకోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా మంగళవారం నియమితులైయ్యారు. గుంటూరులో న్యాయ విద్యను అభ్యసించిన ఆనందరావు గుంటూరు కోర్టుతో పాటు హైకోర్టులోనూ న్యాయవాదిగా పనిచేస్తున్నారు. ఆనందరావు ఏజీపీగా నియమితులవటంపై పొన్నూరు బార్ అసోసియేషన్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వరిలో అగ్గి తెగులు నివారణ చర్యలు చేపట్టాలి: ఏవో

పొన్నూరు టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వరి పైరులో అగ్గి తెగులు నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయశాఖ అధికారి డేగల వెంకట్రామయ్య అన్నారు. పట్టణంలోని నిడుబ్రోలులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వరి పైరును పరిశీలించిన అధికారులు రైతులకు పలు సూచనలు చేశారు. పలు విషయాలపై రైతుల సందేహాలను నివృత్తిచేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నిబంధనలు బేఖాతరు





నిబంధనలకు విరుద్ధంగా సైలెన్సర్, నెంబరు ప్లేట్లు లేని బైక్, ఆటో

- తెనాలిలో విచ్చలవిడిగా రీ మోడల్ వాహనాలు
- అధికంగా వినియోగిస్తున్న మైనర్లు
- పోలీస్ హారన్లు, విచిత్ర ధ్వనులతో గందరగోళం
- హడలెత్తిపోతున్న పాదచారులు
- కేసులు నమోదు చేయాలని పలువురి వినతి

తెనాలి రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపే యువకులు పెరిగిపోతున్నారు. వాహనాల తయారీదారులు, వాటిని కొనుగోలు చేసి నడిపేవారు తప్పనిసరిగా మోటర్ వెహికల్ యాక్ట్ ప్రకారం నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. అయితే పలువురు యువకులు నిబంధనలను తుంగలో తొక్కి అదనంగా హారన్లు, హెవీలైట్లు, నెంబరు ప్లేట్లపై స్టికర్లు, పెయింటింగ్ కలర్స్ మార్చడం, ఇంజన్, చాయిస్ వేరేవాటివి వేయడం, నెంబర్ ప్లేట్లపై స్టిక్కర్లు వేయడం వంటివి చేస్తున్నారు. రీ మోడల్ వాహనాలు కొనుగోలు చేస్తూ రోడ్లపై రయ్.. రయ్ మనిపిస్తూ నిబంధనలను నీళ్ల వదిలేస్తున్నారు. ఆ వాహనాలతో పాదచారులకు, తోటి వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గత కొంత కాలంగా వివిధ రకాల కంపెనీల వాహనాలను రీ మోడల్ చేసి ఒకదాని ఇంజన్ మరొకదానికి మారుస్తూ వాహనాలను గుర్తుపట్టని రీతిలో రీ మోడల్ చేసి రూ.10వేల నుంచి - 20వేల మధ్యలో అమ్మకాలు జరుపుతున్నారు. ఈ వాహనాలకు కనీసం సైలెన్సర్ సైతం సరిగా ఉండటంలేదు, పైగా కొన్ని వాహనాలకు విచిత్రమైన ధ్వనులు వచ్చేలా హారన్‌లు, అత్యవసర సైరన్ అయిన పోలీస్ వాయిస్ సౌండ్ హారన్లను సైతం అమర్చుకుని రయ్‌మంటూ దూసుకుపోతున్నారు. ఈ వాహనాలు తోలే కొందరు పోకిరీలు రోడ్డు వెంబడి పాదచారుల వెనుక నుండి వచ్చి ఒక్కసారిగా హారన్ మోగిస్తుండటంతో వారు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇటీవల ఓ ఆటో వాలా కుక్క అరుపుతో వచ్చే సౌండ్‌తో ఫుట్‌పాత్‌పై సెల్‌ఫోన్ మాట్లాడుకుంటూ వెళుతున్న ఓ విద్యార్థిని పక్కగా హారన్ వేయడంతో ఆ విద్యార్థిని ఉలిక్కిపడి ఫోన్‌సైతం వదిలేసింది. ఐతే వీరిపై ఫిర్యాదు చేయాలన్నా కనీసం వాహనానికి నెంబరు ప్లేటు కూడా లేకపోవడంతో చేసేది లేక వెనుకడుగు వేస్తున్నారు. పట్టంలో అనేక కూడళ్లలో వాహనాలు తిరుగుతున్నప్పటికీ కనీసం వారిని నిలువరించి వాహనాలను సీజ్ చేయడంలో పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండటంతో వారి ఆగడాలకు అడ్డు అదుపులేకుండా పోయిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ వాహనాలపై అధికారులు దృష్టి పెట్టి వాటిని సీజ్ చేసి ప్రజలకు పోకిరీల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆదర్శనీయం స్వాతంత్ర్య సమరయోధురాలు తులశమ్మ జీవితం

- మంత్రి మనోహర్, మాజీమంత్రి ఆలపాటి
- పెదరావూరులో కాంస్య విగ్రహావిష్కరణ



స్వాతంత్ర్య సమరయోధురాలు కల్లూరి తులశమ్మ కాంస్యవిగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి మనోహర్, మాజీ మంత్రి ఆలపాటి

తెనాలి రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గాంధీజీ ఆత్మకథ చదివి ఆకర్షితురాలై స్వాతంత్ర్యం కోసం కొల్లూరు తలశమ్మ చేసిన పోరాటం, ఆమె గడిపిన జీవితం ఆదర్శనీయమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. పెదరావూరుకు చెందిన స్వాతంత్ర్య సమరయోధురాలు కొల్లూరు తులశమ్మ కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని మంగళవారం గ్రామంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మంత్రి నాదెండ్ల మనోహర్, మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, సీనియర్ వైద్యుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తిలు పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో ముత్తేవి రవీంద్రనాథ్, శాఖమూరి తిమ్మనాయుడు రచించిన గాంధీయ మహిళ శ్రీమతి కొల్లూరు తులశమ్మ స్మృతి సంచికను విడుదల చేశారు. అనంతరం మనోహర్ మాట్లాడుతూ కొల్లూరు తులశమ్మ స్వాతంత్ర్యపోరాటానికి గాంధీమహాత్ముని సిద్ధాంతాలైన సత్యం, అహింస, బ్రహ్మచర్యం వంటివాటికి కట్టుబడి తన జీవితాన్ని దేశంకోసం అర్పించిన వీరమహిళని కొనియాడారు. మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పెదరావూరులో పుట్టిన తులశమ్మ 14వ ఏటనే వివాహం చేసుకున్నా స్వాతంత్ర్యం కోసం తన దాంత్య జీవితాన్ని త్యజించి సామాన్య జీవితం గడిపిందన్నారు. ఆమె భర్తకు వైరాగ్యం కలుగకుండా మరో మహిళతో వివాహం జరిపి తాను గాంధీమార్గం వైపు పయనించిందన్నారు. తన మెడలో ఉన్న అరకాసు బంగారాన్ని అమ్మగా వచ్చిన దానిలో రాట్నం, ఖద్దరు చీర, నూకలు కొనుక్కొని సామాన్య జీవితం గడిపారన్నారు. రాట్నంతో నూలు వస్త్రాలు తయారుచేసి గ్రామాల్లో వాటిని విక్రయించి వచ్చిన డబ్బులతో ఖాదీబండారు ఏర్పాటుచేసి చివరి దశలో సైతం దానిని అదేసంస్థకు అందించిన త్యాగమూర్తి తులశమ్మ అన్నారు. ఆమె విగ్రహాన్ని గ్రామంలో ఏర్పాటు చేసిన విగ్రహ దాత దివంగత కొడాలి బసవపున్నారావు, భారతీదేవి కుటుంబ సభ్యులను కార్యనిర్వాహక వర్గ సభ్యులు శాఖమూరి తిమ్మానాయుడు, మారౌతు సీతారామయ్య, యార్లగడ్డ రాధాకృష్ణ, పాలడుగు సురేంద్ర, గడ్డిపాటి రాంబాబు, ఎం.ఆశీర్వాదం, ముత్తేవి రవీంద్రనాథ్‌లను ప్రత్యేకంగా అభినందించారు. గ్రామ సర్పంచ్ కాకి రమాదేవి, పలువురు గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలి

- వివిధ శాఖల అధికారుల సమీక్షలో మంత్రి మనోహర్



రివ్యూ మీటింగ్‌లో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం మాదిరిగా సమస్యలు తెలిపేందుకు వచ్చిన ప్రజలను సంవత్సరాల తరబడి కార్యాలయాల చుట్టూతిప్పించుకోవద్దు. వారికి తగిన గౌరవం ఇచ్చి సావదానంగా ఆలకించండి. తక్షణ పరిష్కారమయ్యే వాటిని పరిష్కరించి ఇది మంచి ప్రభుత్వమని భరోసాగా నిలవండని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్లమనోహర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. మంగళవారం పట్టణంలోని శ్రీరామకృష్ణకవి కళాక్షేత్రంలో నియోజవర్గస్థాయిలో అన్ని శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులతో మంత్రి నాదెండ్ల మనోహర్ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల్లో ఉన్న సమస్యలు ప్రభుత్వం ఏర్పడిన తరువాత పరిష్కరించిన విధానాన్ని అడిగితెలుసుకున్నారు. రెవెన్యూ, శానిటేషన్, హెల్త్, ఆర్‌అండ్‌బీ, పశుసంవర్ధకశాఖ, వ్యవసాయశాఖ, ఇరిగేషన్, పోలీస్, సచివాలయ ఉద్యోగులు ఇలా అన్ని శాఖలను ఆయా శాఖల వారీగా ప్రజల నుండి వస్తున్న సమస్యలను వాటిని పరిష్కరించే విధానంపై ప్రత్యేకంగా తెలుసుకున్నారు. అనంతరం మంత్రిమనోహర్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ప్రజలకు మంచి పాలన అందించలేకపోయిందని ఫలితంగా రోడ్లు గుంతలు తేలిపోయాయని యువత నిరుద్యోగులయ్యారని, గుండాయిజం రౌడీయిజం పెట్రేగిపోయి శాంతిభద్రతలు క్షీణించి ప్రజలు భయాందోళనలో జీవించే పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. వ్యవసాయంపై ఆధారపడిన రైతులు సైతం వారి భూములను ఎక్కడ అప్పటి ప్రభుత్వం లాగేసుకుంటుందోనన్న ఆందోళనలో జీవించారన్నారు. పేదల సొంతింటికళ్లను నెరవేరుస్తానని నమ్మబలికి పంటపొలాల్లో నివేశన స్థలాలు ఇచ్చి కనీస వసతులు కల్పించకుండా మోసం చేసిన దుర్మార్గపు పాలన అప్పటి వైసీపీదని విమర్శించారు. ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, హెల్త్ ఇలా అన్నిశాఖల వారికి పలు సూచనలు చేశారు. సబ్‌కలెక్టర్ సంజనాసిన్హా, డీఎస్పీ జనార్ధన్‌రావు, తహసీల్దార్ గోపాలకృష్ణ, ఎంపీడీవో దీప్తి, పశుసంవర్ధక శాఖ ఏడీఏ డాక్టర్‌నాగిరెడ్డి, పలు శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

దీపం పథకంతో మహిళల మోములో ఆనందం

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



లబ్ధిదారులతో కలిసి దీపం-2 పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మనోహర్

తెనాలి రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నా తెలుగింటి మహిళల మోములో ఆనందం నింపేలా దీపం-2 పథకం ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. మంగళవారం తెనాలిలో దీపం-2 ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్లను మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలపై వంటగ్యాస్ భారం పడకుండా ఉండేలా దీపం పథకం ప్రవేశపెట్టిందన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని లోటు బడ్జెట్‌లో ఉండి ఏటా రూ.13వేల కోట్లు భారం పడుతున్నా తెలుగు మహిళల మోములో ఆనందం నింపేలా సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించడం జరుగుతుందన్నారు. గ్యాస్ బుకింగ్ చేసుకుని డెలివరీ సమయంలో చెల్లించిన సొమ్మును 24గంటల్లో వారి ఖాతాలో జమచేస్తున్నామన్నారు. కొందరి ఖాతాల్లో నగదు పడలేదని వస్తున్న ఫిర్యాదుల పరిష్కారానికి ఉచిత టోల్‌ఫ్రీ నెంబరు 196ను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ కేవైసీ పూర్తి చేయని వారికి ఇటువంటి సమస్యవస్తుందని దానికి ఎవ్వరూ భయపడాల్సిన పనిలేదన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలను సంప్రదించి సమస్య పరిష్కరించుకోవచ్చన్నారు. వైసీపీ సోషల్ మీడియా కూటమి పాలనలో ప్రజలు సంతోషంగా ఉంటే జీర్ణించుకోలేక విషప్రచారం చేస్తుందని వాటిని ఎవ్వరూ నమ్మవద్దన్నారు. ఇప్పటికే ఉచిత గ్యాస్ సిలిండర్లను రాష్ట్ర వ్యాప్తంగా 17లక్షలు అందించడం జరిగిందని తెలియజేశారు. తెల్లరేషన్ కార్డు, ఆధార్ కార్డు ప్రామాణికంగానే ఉచిత గ్యాస్ పథకం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి, సబ్‌కలెక్టర్ సంజనాసింహ్మా, మునిసిపల్ కమిషనర్ శేషన్న, తహసీల్దార్‌గోపాలకృష్ణ, పలువార్డుల కౌన్సిలర్లు, పలుశాఖల అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు

నైపుణ్య గణన సర్వేపై అవగాహన ఉండాలి

- పురపాలక సంఘ కమిషనర్ శేషన్న



సమావేశంలో ప్రసంగిస్తున్న మున్సిపల్ కమిషనర్

తెనాలి, మారీసుపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధిలోని సచివాలయ సిబ్బంది ప్రతి ఒక్కరూ ఏపీఎస్ఎస్‌డీసీ నైపుణ్య గణన సర్వే 2024పై అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ కమిషనర్ శేషన్న అన్నారు. స్థానిక కొత్తపేటలోని శ్రీరామకృష్ణ కవి కళాక్షేత్రంలో మంగళవారం పురపాలక సంఘ పరిధిలోని 47 సచివాలయ సిబ్బందిలో నైపుణ్య గణన సర్వే చేసేందుకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ శేషన్న అధికారులతో కలసి సచివాలయ సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయంలోని ఇంటింటికి డోర్ టూ డోర్ సర్వే పూర్తి చేయాలని, సర్వేలో ఇంటిలోని ప్రతి సభ్యుడి వివరాలను నమోదు చేసి హౌస్ హోల్డ్ మ్యాపింగ్ చేసుకొనేలా తగు జాగ్రత్తలను తీసుకోవాలన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన

తెనాలి అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రతిభ చూపిన విద్యార్థులను మంగళవారం ఐతానగర్ హైస్కూల్‌లో అభినందించారు. ఎన్ఎస్ఎస్ఎం హైస్కూల్‌లో విద్యార్థులు చిత్రలేఖనం, నాటికలలో పాత్రలు పోషిస్తున్న విష్ణువర్ధన్, ఫుట్‌బాల్ క్రీడారంగంలో రాణిస్తున్న హర్షవర్ధన్, స్లోవాకింగ్‌లో ప్రతిభ చూపిన సుధారాణి, ప్రసూనదేవి, సునీతలను సన్మానించారు. కార్యక్రమంలో రచయిత దేవిశెట్టి కృష్ణారావు, హెచ్‌ఎం సునీత, బెల్లంకొండ వెంకట్, శారద, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై కొనసాగుతున్న దర్యాప్తు

పొన్నూరు టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల నిధులు దుర్వినియోగంపై విచారణ కొనసాగుతోంది. జిల్లా రెవెన్యూ అధికారి కార్యాలయంలో రెండు రోజుల నుంచి అధికారులను పిలిపించుకొని జిల్లా ఉన్నతాధికారులు విచారణ కొనసాగిస్తున్నారు. పొన్నూరు నియోజకవర్గానికి ఎన్నికల వ్యయంతో క్రింద ఇప్పటి వరకు రూ. 3 కోట్లు మంజూరు కాగా నిధుల వ్యయంతో విషయంలో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపణలు వచ్చాయి. తహసీల్దార్ కార్యాలయ అధికారులు, సిబ్బంది ఒక్కరిక్కొరు నిధుల వినియోగం విషయంలో ఆరోపణలు చేసుకున్నారు. పొన్నూరు తహసీల్దార్ కార్యాలయంలో ఈ విషయం తీవ్ర సంచలనంగా మారటంతో జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని రెవెన్యూ అధికారులను గుంటూరు పిలిపించారు. గత రెండు రోజులుగా నిధులకు సంబంధించిన వివరాలను ఆరా తీస్తున్నారు. అయితే పొన్నూరు తహసీల్దార్ కార్యాలయంలో ఎటువంటి బిల్లులు అందుబాటులో లేకపోవటం జిల్లా అధికారులు అవాక్కయ్యారు. ఇప్పటికే భోజనాలు, అల్పాహారం పేరుతో లక్షలాది రూపాలయ నిధులను విడుదల చేసిన అధికారులకు రోజుకో వ్యక్తి వచ్చి భోజనాల బిల్లులు తమకు చెల్లించాలని కోరుతుండటం ప్రస్తుత రెవెన్యూ అధికారుకుల కొత్త తలనొప్పి మారింది. తాజాగా బుడంపాడుకు చెందిన వ్యక్తి వచ్చి తనకు రూ.13 లక్షలు చెల్లించాలని అధికారులను కోరటంతో ప్రస్తుత రెవెన్యూ అధికారులు ఏంచేయాలో పాలుపోని స్థితి ఉన్నారు. ఈ విషయం జిల్లా రెవెన్యూ అధికారులకు తెలియటంతో జిల్లా అధికారులు ఎన్నికల సమయంలో పనిచేసిన తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్లను గుంటూరు పిలిపించి వివరణ కోరుతున్నారు. ఎన్నికల సమయంలో పనిచేసిన పొన్నూరు చేబ్రోలు పెదకాకాని మండలాలకు చెందిన సిబ్బంది, బూత్ లెవల్ అధికారులకు కూడా నేటి వరకు వేతనాలు, టీఏ బిల్లులు చెల్లించలేదని కింద స్థాయి సిబ్బంది వాపోతున్నారు. వీటనిటిపై సమగ్ర విచారణ జరపాలని జిల్లా కలెక్టర్ ఆదేశించటంతో ఎక్కడ తమ అక్రమాలు బయటపడతాయేమోనని అధికారులు హడలిపోతున్నారు. అంతేకాకుండా ఎన్నికల కోసం కొనుగోలు చేసిన సిసి కెమెరాలు, కంప్యూటర్ పరికరాల అదృశ్యంపై వివరణ కోరారు.

చక్కెర వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా ప్రభుత్వ వైద్యశాల వైద్యుడు వినీల్



తెనాలి, మారీసుపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ చక్కెర వ్యాధి (షుగర్)పై అప్రమత్తంగా ఉండాలని పట్టణ జిల్లా ప్రభుత్వ వైద్యశాల వైద్యులు డాక్టర్ వినీల్ ఆంధ్రజ్యోతితో అన్నారు. క్రమబద్ధమైన ఆహారం, వ్యాయామంతో దీనిని నివారించవచ్చునని వెల్లడించారు.

ప్రశ్న: షుగర్ వ్యాధి ఎందుకు వస్తుంది?

జవాబు: మనం తిన్న ఆహారంలోని కార్బోహైడ్రేట్లను జీర్ణ వ్యవస్థ చక్కెరగా విడగొడుతుంది. రక్తంలోని చక్కెరలను శరీరం ప్రాసెస్ చేయలేనప్పుడు డయాబెటిస్ వ్యాధి వస్తుంది

ఫటా ఫట్

ప్ర: డయాబెటిస్ ఎన్ని రకాలు?

జ: డయాబెటిస్ రెండు రకాలు. క్లోమ గంధి నుంచి ఇన్సులిన్ ఉత్పత్తి ఆగిపోతే రక్తంలో చక్కెర పేరుకుపోతుంది. ఇలా వచ్చేదాన్ని టైప్ 1 డయాబెటిస్ అని, క్లోమగంధి తగినంత ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేయలేకపోయనా, ఉత్పత్తి అయిన ఇన్సులిన్ సరిగా పనిచేయకపోతే టైప్ 2 డయాబెటిస్ అంటారు.

ప్ర:: ఇది దేనివలన వస్తుంది?

జ: ఇది వయసుతో సంబంధం లేకుండా అధిక బరువు, ఎక్కువగా కుర్చుని పనిచేసేవారికి, శారీరక శ్రమ లేకపోవడం, మానసిక ఒత్తిడివల్ల కూడా వస్తుంది.

ప్ర: దీనిని లక్షణాలు ఏంటి ?

జ: అధికంగా దాహం వేయడం, ఎక్కువసార్లు మూత్ర విసర్జన చేయడం, బాగా అలసిపోవడం, గాయలు త్వరగా మానకపోవడం దీని లక్షణాలు.

ప్ర: షుగరు నియంత్రణకు ఏమి చేయాలి?

జ: ముఖ్యంగా క్రమం తప్పకుండా డాక్టర్ పర్యవేక్షణలో మందులను వాడుతూ, ఆరోగ్యకర బరువును కొనసాగిస్తూ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించుకుని, పౌష్టిక ఆహారం తీసుకుంటే చక్కెర వ్యాధిని అదుపులో ఉంచవచ్చు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు

నైపుణ్య శిక్షణను విజయవంతం చేయాలి

పొన్నూరు టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నైపుణ్య శిక్షణను విజయవంతంచేసేలా సచివాలయ సిబ్బంది కృషిచేయాలని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు కోరారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఏపీఎస్‌డీసీ స్కిల్ సైసెన్స్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ రమేష్‌బాబు మాట్లాడుతూ త్వరలో ఇంటింటి సర్వే నిర్వహించి 15నుంచి 59 సంవత్సరాలు వయస్సు మధ్య వయస్సు ఉన్న వక్తుల డేటాను సేకరించాలని సూచించారు. వారికి ప్రభుత్వం నిర్దేశించే నైపుణ్య శిక్షణ ఇచ్చి నైపుణ్యాలు పెంపొందేలా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనింగ్ కోఆర్డినేటర్ మణికంఠగోపాల్, మాజీ కౌన్సిలర్లు అలపర్తి చంద్రమోహన్, లక్ష్మీనారాయణ చౌదరి, అహ్మద్‌ఖాన్, సీఎంఎన్ హనుమాన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



కొల్లిపర శివాలయంలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు

భక్తి ప్రపత్తులతో నాగుల చవితి

కొల్లిపర, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాగులచవితి పండుగను మండలంలోని గ్రామాల్లో భక్తులు మంగళవారం భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. కార్తీక మాసంతో పాటు నాగులచవితి కావడంతో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దేవాలయాల్లో పండితులు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● పొన్నూరు టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు చేబ్రోలు మండలాల్లో మంగళవారం నాగుల చవితి వేడుకలు భక్తి శ్రద్ధలతో జరిగాయి. మండల పరిధిలోని కట్టెంపూడిలోని నాగేంద్ర స్వామి దేవస్థానం (పుట్ట) నాగుల చవితి వేడుకలు కోలాహలంగా జరిగాయి. ఆలయంలో కొలువుతీరిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి (నాగేంద్ర స్వామి) మూలవిరాట్‌కు పంచామృత అభిషేకాలు జరిగాయి. ఆలయానికి విరాళాల ద్వారా రూ. 86,109, హుండీల ద్వారా రూ. 13,903 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుదాం..

- పురపాలక సంఘ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుదామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. మంగళవారం స్థానిక నందులపేటలోని 4వ వార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక మున్సిపల్ అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం 3వ వార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పురపాలక సంఘ అసిస్టెంటు కమిషనర్ లక్ష్మీపతిరావు, ఎంహెచ్‌వో డాక్టర్ హెలెన్ నిర్మల, వార్డు కౌన్సిలర్లు అడుసుమల్లి వెంకటేశ్వరావు, ఎ.కోటయ్య, మున్సిపల్ ఏఈ సూరిబాబు, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్వాసకోస వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ సుబ్బరాయణం

తెనాలి, మారీసుపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చిన్నారులలో వచ్చే శ్వాసకోస వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ సుబ్బరాయణం అన్నారు. నందులపేట, పద్మశాలిపేటలోని పట్టణ ఆరోగ్య కేంద్రాలలో మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.విజలక్ష్మి ఆదేశాలతో ఆశ డే సమీక్షను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం పాల్గొన్నారు. కార్యక్రమంలో నందులపేట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దేవరపల్లి సుభాష్ రమాదేవి, పద్మశాలిపేట వైద్యాధికారి డాక్టర్ దివి కిషోర్ కుమార్, సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు.

విశ్రాంత సైనికులు, వీరమహిళలకు సత్కారం

తెనాలి అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం విశ్రాంత సైనికులు, వీరమహిళలు, ప్రతిభ చూపిన విద్యార్థులను సన్మానించారు. కొత్తపేటలోని ఏపీ స్టేట్ పెన్షనర్స్ హోమ్‌లో ఎస్.కమల్‌కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏపీ సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ బి.వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాజీ సైనికులకు సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించారు. జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ కె.గోవిందరావు, టి.సుబ్బారావు, వాసుదేవరావు, ఫరీద్, మహారాజు, సురేష్‌కుమార్, శంకరరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే సంపూర్ణ ఆరోగ్యం: మాధవి

కొల్లిపర, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతోనే ప్రజలు సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చునని ప్రకృతి వ్యవసాయాధికారి మాధవి అన్నారు. మంగళవారం మండల కేంద్రం కొల్లిపరలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయల పంటలను కొల్లిపర మండల మోడల్‌టీమ్ ప్రదర్శన నిర్వహించారు.

బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగించిన రైల్వే పోలీసులు

తెనాలి క్రైం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో నుంచి అలిగి వచ్చిన బాలుడిని రైల్వే పోలీసులు గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు రైల్వే ఎస్ఐ జి.వెంకట్రావు తెలిపారు. మంగళవారం ప్లాట్‌ఫారంపై 14సంవత్సరాల పర్వతం పాండు ఒంటరిగా ఉండగా గుర్తించిన పోలీసు సిబ్బంది వివరాలు అడుగగా, ఇంటి వద్ద కోప్పడటంతో నెల్లూరు నుంచి వచ్చినట్లు తెలిపాడు. తల్లిదండ్రులు చిన్నతనంలోనే చనిపోవడంతో నెల్లూరులోని మేనమామ, మేనత్త ఇంటిలో ఉంటూ చదువుకుంటున్నాడు. సరిగ్గా చదువుకోవాలని వారు మందలించటంతో అలిగి తెనాలి వచ్చాడు. బాలుడు మరో మేనత్త గుంటూరులో ఉండటంతో విచారణ అనంతరం బాలుడిని వారికి అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.